

ఆకట్టుకుంటున్న ఫల, పుష్ప ప్రదర్శన

TELTEL 2022/85377

# గ్రామ దండోరా

అక్షరం నా ఆయుధం

తెలుగు దినపత్రిక




07-01-2025 బుధవారం

సంపుటి : 4 సంచిక : 287 వేల : 3

KN CREATIONS & PUBLICATIONS

Hyderabad, Ranga Reddy, Adilabad, Nizamabad,Karimnagar, Warangal, Mahabubnagar, Nalgonda


# ఏ విచారణకైనా రెడీ

- పారిశ్రామికవాడల్లోని భూముల వినియోగ మార్పిడిపై విచారణకు సర్కారు సిద్ధం
- మేము తెచ్చిన హిల్ట్ పాలసీలో దోపిడీకి ఆస్కారం లేదు
- పారిశ్రామికవాడల నుంచి కాలుష్య పరిశ్రమలను ఎట్టి పరిస్థితుల్లోనూ తరలిస్తాం
- కాలుష్య రహిత నగరాన్ని భవిష్యత్ తరాలకు అందించడమే లక్ష్యమన్న డిప్యూటీ సీఎం
- శాసనసభ నిరవధిక వాయిదా

> *2014 నుంచి, ఇటీవల తమ ప్రభుత్వం తెచ్చిన హిల్ట్‌పీ తో పాటు ఇప్పటివరకు జరిగిన పారిశ్రామిక వాడల్లోని భూముల వినియోగ మార్పిడిపై ఏ విచారణను ఆదేశించడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్ర మార్క స్పష్టం చేశారు. ప్రతిపక్షలు అడ్డగోలుగా చేస్తున్న ఆరోపణలకు కట్టుబడి ఉంటే.. ఆ మేరకు లేఖ రాసిన మరుక్షణం ఏ విచారణ సంస్థతో కావాలంటే ఆ సంస్థతో విచారణ చేయించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.*



**హైదరాబాద్:** మంగళవారం శాసనసభలో హైదరాబాద్ పారిశ్రామిక భూముల మార్పిడి (హిల్ట్) విధానం (పీ), తెలంగాణ రైజింగ్‌2047పై లఘు చర్చ సందర్భంగా పలువురు సభ్యులు లేవనెత్తిన అంశాలకు భట్టి జవాబిచ్చారు.

**హిల్ట్ పీతో రూ.10,776 కోట్ల ఆదాయం:** 'ప్రతిపక్షం కడుపులో విషం పెట్టుకుని రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధిని పట్టించుకోకుండా తమ రాజకీయం కోసం రాజకీయాలు చేయడాన్ని మానుకోవాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం లీజు భూములను ఫ్రీహోల్డ్ చేసింది. తమకు కావాల్సిన వాళ్లకు పారిశ్రామిక భూములను వినియోగ మార్పిడి చేసింది. సిరీస్, గల్ఫ్ ఆయిల్ పరిశ్రమలకు భూ వినియోగ మార్పిడి చేసిన అంశాన్ని హిల్ట్ పాలసీతో పోల్చినప్పుడు రాష్ట్ర ఖజానాకు దాదాపు రూ.4,076 కోట్ల నష్టం వాటిల్లింది. హిల్ట్ పీ కింద కాంగ్రెస్ ప్రభుత్వం.. 80 అడుగుల లోపు రహదారి ఉన్న భూములకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ (ఎస్ఆర్‌వో) ధరలో 30 శాతం, 80 అడుగుల కంటే ఎక్కువ

మిగతా 2లో

# కెసిఆర్‌ను కాదు..
# రాహుల్‌ను ఉరితీయాలి

- అది గౌరవ సభ కాదు...కౌరవ సభ
- అసెంబ్లీ తీరుపై మండిపడ్డ కెటిఆర్
- కేసీఆర్ చెప్పు ధూళికి కూడాసరితూగని రేవంత్
- తెలంగాణ తెచ్చిన మొనగాడు కెసిఆర్
- రేవంత్ మాత్రం రియల్ బ్రోకర్
- సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్



> *తెలంగాణ అసెంబ్లీ నడుస్తున్న తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాట్ కామెంట్స్ చేశారు. అసెంబ్లీ గౌరవ సభ కాదని.. కౌరవ సభ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. శాసనసభ బూతుల సభగా మారిందని మండిపడ్డారు. మంగళవారం నాడు జనగామలో పర్యటించిన కేటీఆర్.. రాహుల్ గాంధీ లీడర్ కాదని.. రీడర్ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. వరంగల్‌లో రైతులకు ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను మరిచిన రాహుల్ గాంధీని ఉరితీయాలని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్టీ కార్యకర్తలకు పలు కీలక సూచనలు చేశారు.*

**జనగామ:** 'కుటుంబం అన్నాక గొడవలు ఉంటాయని.. అలుగుడు గులుగుడు ఉంటది, సర్దుకుపోవాలన్నారు. లేదంటే.. కాంగ్రెస్ వాళ్లకు సందు దొరుకుతది' అని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి నిస్సిగ్గుగా ఇచ్చిన హామీలన్నింటినీ మర్చిపోయారని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్‌ను ఉరి తీయాలని రేవంత్ రెడ్డి అన్న కామెంట్స్‌ని ప్రస్తావించిన కేటీఆర్.. చావునోట్లో తలపెట్టి తెలంగాణను తెచ్చినందుకు కేసీఆర్‌ను ఉరి తీయాలా? అని ప్రశ్నించారు. ఇదే సమయంలో రైతుల అవస్థలను కూడా కేటీఆర్ ప్రస్తావించారు. యాప్‌లో యూరియా దొరకక రైతులు అవస్థలు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి






# డిజిటల్ డిపాజిట్ల మోసం..
# ఫాల్కన్ ఎండీ అమర్‌దీప్ అరెస్ట్

**హైదరాబాద్:** ఫాల్కన్ ఎండీ అమర్‌దీప్‌ను తెలంగాణ సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. ముంబయిలో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే అమర్‌దీప్‌పై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ నుంచి ఆయన ముంబయికి చేరుకోవడంతో ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకొని తెలంగాణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. డిజిటల్ డిపాజిట్ల పేరిట అమర్‌దీప్ రూ.850 కోట్లు వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు. యాప్ ఆధారిత డిపాజిట్లతో ఫాల్కన్ సంస్థ

మిగతా 2లో



# కొడుకు, కుమార్తెను ఉరేసి చెరువులో పడేసిన తండ్రి

2

# వరంగల్ కోట భూ ఆక్రమణలు తొలగించండి

- కోట తెలంగ్యాణ వారసత్వ సంపద
- సిఎం రేవంత్‌రెడ్డికు కిషన్ రెడ్డి లేఖ

2

> *తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మంగళవారం లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. ప్రధానంగా వరంగల్ కోట భూములను భారత పురావస్తుశాఖకు చెందినవిగా గుర్తించాలని సూచించారు. కోట భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు.*




# కాలుష్య నివారణకు ఇవి పాలసీ అమలు

- ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు
- ఈవి వాహనాల ఛార్జింగ్ స్టేషన్ల పెంపునకు చర్యలు
- అసెంబ్లీలో మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

2

> *ఈవి వాహనాల బ్యాటరీల సామర్థ్యం పెంపునకు కంపెనీలు చర్యలు చేపట్టాయని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈవి పాలసీ కింద తయారీదారులు, డీలర్లతో భేటీ ఏర్పాటు చేశామని అన్నారు. ఈవి వాహనాల ఛార్జింగ్ స్టేషన్ల సంఖ్య పెంపునకు చర్యలు ఉంటాయన్నారు. మంగళవారం శాసనసభలో పొన్నం మాట్లాడుతూ.. ఈవీ వాహనాల రాయితీ అమలుతో రూ.900 కోట్ల పన్ను నష్టం అని.. ఉద్యోగులు ఈవి వాహనాలు కొనుగోలు చేస్తే 20 శాతం తగ్గింపు ఉంటుందని పొన్నం తెలియజేశారు.*



# ఎపి ట్రాప్‌లో కాంగ్రెస్ పడిపోతోంది



- మా హయాంలోనే 90శాతం పనులు పూర్తి
- పదిశాతం పనులు పూర్తి చేస్తే నీళ్లు వాడుకోవచ్చు
- పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై బిఆర్ఎస్
- కొత్త ప్రాజెక్టు కడితే ఎప్పటికి పూర్తవుతుందో ?
- రిజర్వాయర్లను సందర్శించిన బిఆర్ఎస్ నేతలు
- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి నిరంజన్ రెడ్డి

> *పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 10 శాతం పనులను పూర్తిచేస్తే నీళ్లను వాడుకోవచ్చని మాజీమంత్రి, బిఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు కొత్త ప్రాజెక్టు కడితే ఎప్పటికి పూర్తవుతుందని ప్రశ్నించారు. ఏపీ ట్రాప్‌లో కాంగ్రెస్ నేతలు పడిపోవద్దన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులు 90 శాతం పూర్తయ్యాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. రూ.32 వేల కోట్ల పనులు బీఆర్ఎస్ పూర్తి చేసిందని తెలిపారు. రూ.27 వేల కోట్ల బిల్లులు చెల్లించామని పేర్కొన్నారు.*

2



# సోయా కొనుగోళ్లపై ఆందోళన

- బిఆర్ఎస్ పిలుపుతో జిల్లా బంద్
- స్వచ్ఛందంగా వాణిజ్య సంస్థల మద్దతు
- మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అరెస్ట్

**ఆదిలాబాద్:** ప్రభుత్వం వెంటనే సోయా కొనుగోళ్ల చేపట్టాలని మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బంద్‌కు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. దీంతో పట్టణంల వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. పట్టణంలో బిఆర్ఎస్ బైక్ ర్యాలీ నిర్వహించింది. ఈ క్రమంలో ఆర్టీసీ

మిగతా 2లో

# కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్



- మన పిల్లలకు మంచి భవిష్యత్ కోసం తపన
- నగరంలోపల ఉన్న పరిశ్రమలను అవతలికి తరలింపు
- నగరంలో పీల్చే గాలి స్వచ్ఛంగా ఉండాలన్నదే లక్ష్యం
- పారిశ్రామక ప్రాంతాలను నివాస యోగ్యంగా మారుస్తాం
- హిల్ట్‌పాలసీపై ప్రకటన చేస్తూ..మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

> *రేపటి తరాల భవిష్యత్ కోసం హిల్ట్‌పాలసీని తీసుకొస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. హిల్ట్‌పాలసీపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. 'హిల్ట్‌పాలసీని సాదాసీదా భూమార్పిడిగా చూస్తున్నారు. దీనిపై సద్విమర్శలు చేస్తే స్వీకరిస్తాం. హిల్ట్ పాలసీ ద్వారా పారిశ్రామిక ప్రాంతం.. నివాస ప్రాంతంగా మారుతుంది.*

**హైదరాబాద్:** ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాల్లో కాలుష్యం లేకుండా చేసేందుకు సీఎం యత్నిస్తున్నారు. నగరంలోని పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలివైపునకు తరలిస్తాం అని అన్నారు. ఈ పాలసీ మేము కొత్తగా చేస్తున్నది కాదు. దీనికోసం విస్తృతంగా చర్చలు జరిగాయి. వనరులు సమకూర్చుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది. హిల్ట్ పాలసీ గురించి తెలియకుండా ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారు. పారిశ్రామికవేత్తల భూములను.. ప్రభుత్వ భూములని ప్రచారం చేస్తున్నారు. జీవో ఎంఎస్ 19కు

మిగతా 2లో

# కెసిఆర్‌ను కాదు.. రాహుల్‌ను ఉరితీయాలి

మొదటి పేజీ తరువాయి

రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటూ ఘాటైన వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు.

**కేసీఆర్ చెప్పు ధూళికి కూడాసరితూగని రేవంత్**

సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ చెప్పు ధూళికి కూడా సరితూగడని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మంగళవారం జనగామలో బీఆర్ఎస్ తరఫున గెలిచిన సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన .. సీఎం రేవంత్‌రెడ్డిపైన, కాంగ్రెస్ ప్రభుత్వంపైన విమర్శల వర్షం గుప్పించారు. తెలంగాణ తెచ్చిన మొనగాడు కేసీఆర్ అని, అందుకే ఆయన తన తండ్రి అని గర్వంగా చెప్పుకుంటానని కేటీఆర్ అన్నారు. అలాంటి మొనగాడిని సవాలు చేస్తున్న రేవంత్ రెడ్డి అనేటోడు ఆయన చెప్పు ధూళికి కూడా సరిపోడని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఒక్క ప్రెస్ మీట్ పెడితేనే రేవంత్ రెడ్డి ఆగమాగం అయితున్నడని, ఆయన అసెంబ్లీకి వచ్చి మాట్లాడితే అక్కడే గుండె ఆగి సస్తడని అన్నారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధిద్దామని ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ సూచించారు. కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేయాలన్న ఆలోచనతోనే ఓటు వేసి ఆయనను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన ప్రతి ఒక్క సర్పంచి మున్సిపల్ ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని కోరారు. వరంగల్ జిల్లాలో సర్పంచులు పెద్ద సంఖ్యలో గెలిచారని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు పాల్పడ్డా, ఒత్తిళ్లకు గురిచేసినా పార్టీ కోసం నిలబడ్డారని ప్రశంసించారు.



బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకుడికి ధన్యవాదాలు చెప్పారు. జనగామ ర్యాలీ చూస్తే 'కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అయ్యారు' అనిపించిందని అన్నారు. ప్రజలు గులాబీ జెండాను చూడగానే చప్పట్లు కొడుతుంటే సంతోషం అనిపించిందని, కాళోజీ మాటలు గుర్తొచ్చాయని అన్నారు. కేసీఆర్ ఎప్పుడు ముఖ్యమంత్రి అయితారా అని ప్రజలు కసితో ఎదురుచూస్తున్నారని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో ఏ పాత్ర లేకున్నా అన్ని పదవులు ఇచ్చిన పార్టీని వదిలి కడియం శ్రీహరి సీఎం రేవంత్ రెడ్డితో కలిశాడని విమర్శించారు. ఇక్కడి నిబద్ధత కలిగిన కార్యకర్తలు బీఆర్ఎస్ బలపర్చిన 150 మంది సర్పంచులను గెలిపించారని మెచ్చుకున్నారు. చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, దొడ్డి కొమురయ్య, రాణి రుద్రమదేవి పుట్టిన గడ్డ ఇదని కేటీఆర్ కీర్తించారు. సీఎం రేవంత్‌రెడ్డిపైన, రాష్ట్ర ప్రభుత్వంపైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. రేవంత్‌రెడ్డి పాలన చేతగాక బీఆర్ఎస్ మీద నిందలు వేస్తున్నాడని ఆరోపించారు. ఏదో అడ్డిమారి గుడ్డిసూటిల సీఎం అయిన రేవంత్‌రెడ్డి.. మూడేళ్లు టైమ్‌పాస్ చేసిపోక అవాకులు, చెవాకులు పేలుతున్నాడని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి రైతులకు యూరియా ఇయ్య చేతగాదుగానీ.. అబద్దాలు అనర్గళంగా వస్తయని ఎద్దేవా చేశారు. 'కేసీఆర్‌ను మల్ల మొలకెత్తనియ్యను' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి శపథం చేయడంపైనా కేటీఆర్ ÷రైయ్యారు. 'నువ్వేంది కేసీఆర్‌ను మొలకెత్తనియ్యకపోయేది' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. మీ కాంగ్రెస్ పార్టీ 60 ఏండ్లు తెలంగాణను తొక్కిపట్టిందని, తెలంగాణను మొలకెత్తనివ్వమని విర్రవీగిందని, అసుంటి కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి తెలంగాణను మొలిపించిన మొగోడు, మొనగాడు కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. రైతులకు యూరియా ఇవ్వడంలో రేవంత్‌రెడ్డి సర్కారు పూర్తిగా విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. సరిపడా యూరియా అందక రైతులు గోస పడుతున్నరని ఆవేదన వెలిబుచ్చారు. 'రేవంత్ పాలనలో యూరియా షాప్‌ల లేదు, యాప్‌ల లేదు' అని ఎద్దేవా చేశారు. ఇప్పుడు కొత్తగా కార్డు అంటూ కొత్త పాట అందుకున్నరని అన్నారు. 'రైతులకు యూరియా తెలివిలేక నాటకాలాడుతున్న దద్దమ్మలు ఈ కాంగ్రెసోళ్లు' అని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో రైతులకు సరిపడా ఎరువులు అందాయని, ఎరువుల దుకాణాల ముందు రైతులు లైన్‌లలో నిలబడాల్సిన అవసరం రాలేదని కేటీఆర్ గుర్తుచేశారు. కేసీఆర్ స్వయంగా రైతు కాబట్టి రైతుల సమస్యలు తెలుసని, ఆయన రేవంత్‌రెడ్డిలా రియల్ ఎస్టేట్ బ్రోకర్ కాదని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## కాలుష్య నివారణకు ఇవి పాలసీ అమలు

**హైదరాబాద్:** ఉద్యోగులకు 20 శాతం వరకు తగ్గించాలని కంపెనీలను కోరామని అన్నారు. ఎంఎన్ సి కంపెనీలు ఈవి వాహనాలు కొనుగోలు చేసేలా విధానం ఉంటుందని, పిఎం ఈ డ్రైవ్ కింద 575 ఆర్టిసి బస్సులు నడుస్తున్నాయని చెప్పారు. కొత్తగా 200కు పైగా ఈవి బస్సులు వస్తున్నాయని, వరంగల్ లో 100, నిజామాబాద్ లో 50 బస్సులు వస్తున్నాయని పేర్కొన్నారు. 15 ఏళ్లు దాటిన వాహనాలను స్క్రాప్ చేయాలని, స్క్రాప్ పాలసీ కింద ప్రోత్సాహం ఇచ్చేలా జివో తీసుకువచ్చామని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా మంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఈవీ పాలసీని తీసుకువచ్చామని, ఈ ఏడాది కాలంలో లక్ష ఈవీ వాహనాలు అమ్ముడయ్యాయని వెల్లడించారు. కాలుష్యం తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలని భాజపా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలపై కేంద్రం సబ్సిడీ ఇస్తోందని.. రాష్ట్ర ప్రభుత్వం కూడా అలా ఇస్తోందా? అని ప్రశ్నించారు.

## వరంగల్ కోట భూ ఆక్రమణలు తొలగించండి

**న్యూఢిల్లీ:** కోట భూముల్లోని ఆక్రమణదారులను తొలగించడం గురించి ఈ లేఖలో ప్రస్తావించారు. దాదాపు 250 సంవత్సరాలపాటు కాకతీయుల రాజధానిగా కీర్తిగడించి ఘనమైన చారిత్రక నేపథ్యం, సాంస్కృతిక వైభవంతో అలరారిన ఓరుగల్లు పట్టణం.. తెలంగాణ వారసత్వ సంపదకు నిలయంగా విరాజిల్లుతోందని వ్యాఖ్యానించారు కిషన్‌రెడ్డి. కాకతీయుల కాలంలో ఇతర రాజ్యాల నుంచి ఎదురయ్యే దండయాత్రల నుంచి రాజధానికి రక్షణ కల్పించటం కోసం ఒక ప్రణాళిక ప్రకారం 7 ప్రాకారాలతో వరంగల్ కోటను ఎంతో పకడ్బందీగా నిర్మించారని పేర్కొన్నారు. ఢిల్లీ సుల్తానులు, హైదరాబాద్ నవాబుల దాడులను ఎదుర్కొన్న కోటని అభివర్ణించారు. నేటికీ కాకతీయుల శౌర్య పరాక్రమాలకు ప్రతీకగా నిలిచిందని చెప్పుకొచ్చారు. ప్రతిరోజూ వేలాదిమంది పర్యాటకులు ఈ కోటను సందర్శించి కోటలో దాగి ఉన్న శిల్ప సంపద, నిర్మాణ నైపుణ్యం, వందలాది ఆలయాలు, వాటి నేపథ్యం, కోట ప్రాధాన్యం గురించి తెలుసుకుంటున్నారని వెల్లడించారు కిషన్‌రెడ్డి. పర్యాటకులను మరింతగా ఆకర్షించేందుకు కేంద్రప్రభుత్వం ఇటీవలే సౌండ్, ఇల్యూమినేషన్ లైటింగ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసిందని వివరించారు.

# ఎపి ట్రాప్‌లో కాంగ్రెస్ పడిపోతోంది



**మహబూబ్‌నగర్:** కేసీఆర్ వచ్చాక తెలంగాణ నీటి లభ్యత గురించి తెలియజేశారని అన్నారు. ముందే అప్రమత్తమైతే తెలంగాణ నీటి వాటాను కోల్పోయేది కాదని అభిప్రాయపడ్డారు. పాలమూరులో పడావు పడ్డ ప్రాజెక్టులపై గులాబీ పార్టీ సమరభేరీ మోగించింది. ఈ క్రమంలో జూరాల ప్రాజెక్టును మాజీ మంత్రులు నింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం సందర్శించింది. నార్లపూర్ పంప్‌హౌజ్, రిజర్వాయర్, వ్టటెం పంప్‌హౌజ్, కరివెన రిజర్వాయర్లను సందర్శించారు. ప్రాజెక్టులను పడావు పెట్టిన ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. జూరాలకు సరాసరి 25 రోజులు వరద వస్తుందని అన్నారు. జూరాల ప్రాజెక్టు కడితే తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. 3 లక్షల పైచిలుకు జనం ముంపునకు గురవుతారని పేర్కొన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తయి అన్ని రిజర్వాయర్లను నింపితే 68 టీఎంసీల నీళ్లు వస్తాయని తెలిపారు. అవసరమైతే మళ్లీ నీళ్లను నింపుకోవచ్చని అన్నారు. దీనివల్ల ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. తెలంగాణ నీళ్లను వాడుకుంటే ఇబ్బందని జూరాల ప్రాజెక్టు తీసుకొచ్చారని మండిపడ్డారు. జూరాల ప్రాజెక్టును కాంగ్రెస్ నాయకులు 40 ఏళ్ల నుంచి ప్రజలకు చూపిస్తున్నారని నిరంజన్ రెడ్డి తెలిపారు. జూరాల నుంచి నీళ్లు తీసుకోవడం అంటే పాలమూరుకు నీళ్లు వద్దని చెప్పడమే అని స్పష్టం చేశారు. ఇంత చేసినా జూరాల వద్ద నీళు ్లండవని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మంచిని తక్కువ చేసి చూపించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఏం కోల్పోయామో అర్థమైతే ఎప్పటికీ మిమ్మల్ని క్షమించరని హెచ్చరించారు. చరిత్రలో కాంగ్రెస్‌కు స్థానమే ఉండదని.. ఎప్పటికైనా చరిత్రలో నిలిచేది కేసీఆరే అని స్పష్టం చేశారు. దొంగ మాటలు, మోసాలతో ప్రజలను ముంచాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి జీవో 24ను ఒకసారి చదువుకోవాలని సూచించారు. 90 శాతం పనులు పూర్తయిన ప్రాజెక్టును ఆపడమేంటని ఆయన ప్రశ్నించారు. తట్టెడు మట్టి తీయకుండానే బీఆర్ఎస్ ప్రభుత్వంపై అబద్దాలు ఆడుతున్నారని మండిపడ్డారు. అనేక కేసులు వేసి ఏపీ ప్రభుత్వానికి కాంగ్రెస్ నాయకులు సహకరించారని ఆరోపించారు. జూరాల నుంచి పాలమూరుకు నీళ్లు అంటేనే పెద్ద కుట్ర అని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. తప్పుల తడకగా ఉత్తమ్ కుమార్ రెడ్డి పీపీటీ ఇచ్చారని విమర్శించారు. హరీశ్‌రావు పవర్‌ఫుల్ ప్రజెంటేషన్‌తో ఉత్తమ్‌కు పీపీటీతో సమాధానమిచ్చారని తెలిపారు. ప్రజలకు అన్ని విషయాలపై సంపూర్ణ అవగాహన ఉందని అన్నారు. కృష్ణా నది నీళ్లను తెలంగాణకు దక్కకుండా చేసేందుకే కుట్రలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. అప్పుడైనా.. ఇప్పుడైనా కృష్ణా నీళ్లు పాలమూరుకు రాకుండా చేస్తున్నారని అన్నారు. నిజాం కాలంలోనే కృష్ణా నీటి కోసం అనేక ప్రాజెక్టులకు రూపకల్పన చేశారని తెలిపారు. తుంగభద్రలో నీటి పంపకాలపై 65 టీఎంసీల కోసం 1944లోనే ఒప్పందాలు జరిగాయని అన్నారు. భీమా ప్రాజెక్టును యాదగిరి జిల్లాలో మొదట ప్రతిపాదించారని, ఆలమట్టిని కూడా నిజాం కాలంలోనే ప్రతిపాదించారని తెలిపారు. పాలమూరుకు 174 టీఎంసీల నీళ్లు ఇవ్వాలని నిజాం పలు ప్రాజెక్టులను నిర్మించారని పేర్కొన్నారు. కానీ నిజాం కాలంలో ప్రతిపాదించిన ప్రాజెక్టులను నెహ్రూ ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తుచేశారు. అప్పటి నుంచే తెలంగాణకు అన్యాయం చేయడం ప్రారంభమైందని తెలిపారు. సిద్దేశ్వరం దగ్గర కట్టాల్సిన శ్రీశైలం ప్రాజెక్టును 86 కిలోమీటర్ల కింద కట్టారని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. సిద్ధేశ్వరం దగ్గర ఆ ప్రాజెక్టు కట్టి ఉంటే గ్రావిటీ ద్వారా పాలమూరుకు నీళ్లు వచ్చేవని పేర్కొన్నారు. జల విద్యుత్ కోసం కట్టిన శ్రీశైలం నుంచి తెలుగుగంగ పేరుతో నీటిని తరలించారని అన్నారు. తెలుగుగంగ ద్వారా కడప, నెల్లూరు జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు నీళ్లు అందించారని పేర్కొన్నారు. కృష్ణా నదిని మొత్తం మలుపుకు పోయేలా పోతిరెడ్డిపాడును చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీశైలం దరిదాపుల్లోకి రాకుండా చేసే కుట్ర అప్పుడు జరిగిందని.. ఇప్పుడు కూడా జరుగుతోందని అన్నారు.

# ఏ విచారణకైనా రెడీ

మొదటి పేజీ తరువాయి



వెడల్పుతో రహదారి ఉన్నచోట ఎస్ఆర్‌వో ధరలో 50 శాతం చెల్లించేలా నిర్ణయం తీసుకుంది. ఈ భూములపై ప్రభుత్వానికి ఎలాంటి హక్కు లేదు. కేవలం భూ వినియోగ మార్పిడి చేస్తున్నందుకు ఈ ఫీజులు వసూలు చేస్తున్నాం. ప్రస్తుతం ఉన్న భూ వినియోగ మార్పిడి ధరల ప్రకారం అయితే కేవలం రూ.574 కోట్ల ఆదాయం మాత్రమే రాష్ట్రానికి లభిస్తుంది. అదే హిల్ట్ పీ కింద దాదాపు 4,780 ఎకరాల భూములకు భూ వినియోగ మార్పిడికి అవకాశం కల్పించడం ద్వారా దాదాపు రూ.10,776 కోట్ల ఆదాయం లభిస్తుంది..' అని డిప్యూటీ సీఎం తెలిపారు.

**హిల్ట్ పీ అత్యుత్తమం, పారదర్శకమైనది..**

'హిల్ట్ పాలసీ రాగానే ప్రధాన ప్రతిపక్షనికి చెందిన ఓ నాయకుడు ప్రెస్‌మీట్ పెట్టి రాష్ట్రంలోని భూములన్నింటినీ అమ్మేస్తూ రూ.5 లక్షల కోట్ల స్కామ్‌కు తెరలేపారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలు విస్మరించి, బట్ట కాల్చి మీద వేసి తుడుచుకోమంటున్నారు. వారు రాష్ట్ర ప్రజా ప్రయోజనాల కంటే.. సొంత ప్రయోజనాల కోసం ఎక్కువగా పాకులాడుతున్నారు. హిల్ట్ పీ వల్ల రాష్ట్రానికి ఆదాయం లభిస్తుంటే.. గతంలో వారు చేసిన నిర్ణయాలతో భారీ నష్టం జరిగింది. గత ప్రభుత్వం అనుసరించి విధానాలతో పోలిస్తే హిల్ట్ పీ అత్యుత్తమమైనది. పారదర్శకమైనది. ఆదాయం సమకూరుతుంది. వారు ఆజామాబాద్, బాలానగర్, హఫీజ్‌పేట పారిశ్రామిక వాడల్లో ప్రభుత్వ భూములు లీజులో ఉంటే...వాటిని వేలానికి పెట్టకుండా ఇష్టానుసారం ఇచ్చేశారు. ప్రభుత్వానికి ఆదాయం రాకుండా పారిశ్రామికవేత్తలకు అప్పగించారు. వనరుల సమీకరణకు 2019లో అప్పటి ఆర్థిక మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో వేసిన కేబినెట్ సబ్ కమిటీకి సంబంధం లేకుండా కేటీఆర్ పరిశ్రమల మంత్రిగా జీవో ఇచ్చి పారిశ్రామిక భూములను ఐటీ పరిశ్రమలకు మార్చేలా ఉత్తర్వులు ఇచ్చారు. వారికి అనుకూలమైన వారికి భూ మార్పిడి చేశారు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారు. మేము తెచ్చిన పాలసీలో దోపిడీకి ఆస్కారం లేదు..' అని భట్టి చెప్పారు.

**రాష్ట్రానికి ఉత్పాదక షాక్ అవసరం**

'ప్రస్తుతం రాష్ట్రం 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ. వృద్ధి ఇలానే కొనసాగితే 2047 నాటికి 1.2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగానే ఎదుగుతాం. ఇది సరిపోదని..3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్‌ఉ2047 తీసుకొచ్చాం. కేవలం ఎక్కువ మందికి ఉపాధి కల్పించడం ద్వారా ఈ లక్ష్యానికి చేరుకోలేం. మనకు ఒక 'ఉత్పాదకత షాక్' అవసరం. పెట్టుబడి రేటును జీఎస్డీపీలో 52 శాతానికి పెంచాలనే కఠిన లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం..' అని భట్టి తెలిపారు.

**తర్వలో హిల్ట్ పీ మార్గదర్శకాలు: శ్రీధర్‌బాబు**

పదేళ్ల పాటు సాగిన బీఆర్ఎస్ పాలనలో చాలాచోట్ల అడ్డగోలు భూకేటాయింపులు జరిపిన విషయం వాస్తవమని.. తొలుత మాట్లాడిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పరిశ్రమల పేరిట జరిగిన ఈ భూకేటాయింపులపై తప్పకుండా విచారణ చేపడతామని చెప్పారు. 'హిల్ట్ పాలసీ ఏకపక్ష నిర్ణయం కాదు. నిపుణులు, మేధావులతో చర్చించిన తర్వాతే రూపొందించాం. ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి మార్గదర్శకాలు త్వరలో విడుదలవుతాయి. మంత్రివర్గ ఉప సంఘం సిఫారసులను పబ్లిక్ డొమైన్ (అందరికీ అందుబాటు)లో పెట్టం. అవి కేవలం ఇన్_మెరా (అంతర్గత) సూచనలు. వాటిని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను పాజిటివ్‌గా చూడాలి. అప్పుడే నిర్ణయాల అమలు వేగవంతంగా, విజయవంతంగా పూర్తవుతుంది. పరిశ్రమల తరలింపుతో కార్మికులకు ఉపాధి ప్రశ్నార్థకమవుతుందనే ఆందోళన అవసరం లేదు. కారి?మక చట్టాలు తప్పకుండా అమల్లో ఉంటాయి..' అని శ్రీధర్‌బాబు చెప్పారు.

**పూర్తి పారదర్శక పాలసీ: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

పారిశ్రామిక భూమి బదలాయింపు విధానం రాష్ట్ర సుస్థిర పురోగతితో పాటు పారిశ్రామిక కాలుష్య రహిత హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు దోహదం చేస్తుందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. పూర్తి పారదర్శకంగా ఉండేలా గొప్ప పాలసీకి రూపకల్పన చేశామని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు అర్థరహిత విమర్శలు చేస్తున్నాయని విమర్శించారు. లీజు హక్కులతో ఉన్న పారిశ్రామిక భూములకు ఈ కొత్త విధానం వర్తించదని, పూర్తిస్థాయి యాజమాన్య హక్కులతో భూములు కలిగిఉన్న పారిశ్రామిక భూములకే వర్తిస్తుందని స్పష్టం చేశారు.

**ఆ జీవోలో చీకటి కోణాలు: ఏలేటి**

'కాలుష్య కారక పరిశ్రమలను నగరం బయటకు పంపడం సరైన నిర్ణయమే. కానీ ఎలాంటి పర్యావరణ అధ్యయనాలు, కమిటీల నివేదికలు లేకుండా బయటకు తరలే పరిశ్రమలకు ప్రత్యామ్నాయ భూములు కేటాయించకుండా హడావుడిగా హిల్ట్ పాలసీని తేవడంలో ఆంతర్యం ఏమిటి? ప్రభుత్వం జారీ చేసిన జీఓ 27లో అనేక చీకటి కోణాలు ఉన్నాయి. 22 పారిశ్రామిక వాడల్లోని పరిశ్రమలను ఔటర్ రింగు రోడ్డు వెలుపల ఎక్కడికి తరలిస్తారు? అత్యంత కాలుష్య కారక పరిశ్రమలున్న ఐడీఏ బొల్లారంను హిల్ట్ పాలసీలో చేర్చకపోవడం విడ్డూరం..' అని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'పరిశ్రమల భూములతో రియల్ ఎస్టేట్ దందా చేయడాన్ని ప్రభుత్వం మానుకోవాలి. ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పచ్చదనం పెంచాలి..' అని సూచించారు. రాష్ట్ర విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన హిల్ట్ పాలసీని అందరూ స్వాగతించాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో వాయు నాణ్యత వేగంగా క్షిణిస్తోందని, ఇదే తరహాలో కాలుష్యం పెరిగితే పదేళ్లలో ఢిల్లీ తరహా పరిస్థితులు తలెత్తుతాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

**ఆకాశానికి నిచ్చెన వేస్తే లాభం లేదు: పాల్వాయి హరీశ్‌బాబు**

'మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ అంటూ ప్రభుత్వం ఆర్భాటం చేస్తోంది. గ్లోబల్ సమ్మిట్‌లో విజన్ డాక్యుమెంట్‌ఉ2047 విడుదల చేశారు. ఇప్పుడు అక్కడ టెంట్లు కూడా లేవు. ఆకాశానికి నిచ్చెన వేస్తే లాభం లేదు..' అని బీజేపీ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సమగ్ర చర్చ జరగాల్సిన అవసరం ఉందని మరో బీజేపీ సభ్యుడు పాయల్ శంకర్ అన్నారు.

**హిల్ట్ పాలసీకి చట్టబద్ధత లేదు: అక్బరుద్దీన్**

'వనరుల సమీకరణకు ఈ ప్రభుత్వం భూముల వెనుక పరిగెడుతోంది. ప్రభుత్వం విడుదల చేసిన హిల్ట్ పాలసీ జీఓకు ఎలాంటి చట్టబద్ధత లేదు. పాలసీ రూపకల్పనలో పారదర్శకత కనిపించడం లేదు. పాలసీలో పేర్కొన్న భూములు ప్రైవేటువా లేక ప్రభుత్వ భూములా అనే అంశంపై ప్రభుత్వం పూర్తి స్పష్టత ఇవ్వాలి..' అని ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుదీన్ ఒవైసీ అన్నారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీకి కేటాయించిన 50 ఎకరాలను వెనక్కి తీసుకునే ప్రయత్నాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. నగర కాలుష్యాన్ని నివారించేందుకు ఉద్దేశించిన హిల్ట్ పాలసీకి తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు చెప్పారు.

## మొదటి పేజీ తరువాయి

### డిజిటల్ డిపాజిట్ల మోసం..

### ఫాల్కన్ ఎండీ అమర్‌దీప్ అరెస్ట్

భారీ కుంభకోణానికి తెరతీసింది. షేర్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో ప్రజలను అమర్ మభ్యపెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. స్కామ్ వెలుగులోకి రాగానే అమర్‌దీప్ దంపతులు దుబాయ్‌కి పారిపోయారు. ఈ కేసులో ఇప్పటికే సీఈవో, అమర్‌దీప్ సోదరుడిని అధికారులు అరెస్ట్ చేశారు.

**నకిలీ వెబ్‌సైట్, యాప్‌లతో మోసాలు**

ఫాల్కన్ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ పేరిట భారీ పెట్టుబడి మోసానికి పాల్పడినట్లు సీఐడీ పోలీసులు తెలిపారు. నకిలీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా మోసాలు చేశారని.. ప్రముఖ ఎంఎన్‌సీల పేర్లతో ఫేక్ ఇన్‌వాయిస్ ఒప్పందాలు చేసుకున్నట్లు గుర్తించామన్నారు. దాదాపు 7,056 మంది డిపాజిటర్లు.. అందులో 4,065 మంది బాధితులు ఉన్నారని తెలిపారు. తక్కువ కాలంలో ఎక్కువ పెట్టుబడి వచ్చేలా బాధితులను ఆకర్షించారన్నారు. ఇప్పటి వరకు 11 మంది నిందితులను అరెస్ట్ చేశామని.. వీరిలో డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్‌లు, చార్టర్డ్ అకౌంటెంట్‌లు ఉన్నారని తెలిపారు. 12 ప్లాట్లు, 4 లగ్జరీ కార్లు, నగదు, బంగారం, షేర్లను సీజ్ చేసినట్లు వివరించారు.

### సోయా కొనుగోళ్లపై ఆందోళన

డిపో ఎదుట ధర్నా నిర్వహించడానికి మాజీ మంత్రి జోగు రామన్నతో పాటు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. జోగు రామన్న ఆధ్వర్యంలో ఈ బంద్ నిర్వహించారు. సోయా కొనుగోలులో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు గిట్టుబాటు ధరలు, సరైన రాయితీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈక్రమంలో ఆర్టీసీ డిపో వద్ద పోలీసు బలగాలు భారీగా మోహరించాయి. జోగు రామన్నతో సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. జోగు రామన్న ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోయా కొనుగోలుపై బంద్ నిర్వహించాలని పిలుపునిచ్చారు. గత కొంత కాలంగా సోయా రైతులు పడుతున్న ఇబ్బందులపై పోరాటం చేస్తున్నారు. ముఖ్యంగా సోయా కొనుగోలులో గిట్టుబాటు ధరలపై సరైన ఆధారిత విధానాలు లేకపోవడంపై పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలోనే బంద్‌కి పిలుపునిచ్చారు. ఈ క్రమంలో బస్సుల రాకపోకలను నేతలు అడ్డుకున్నారు. ఆర్టీసీ డిపో వద్దకు పోలీసులు భారీగా చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న జోగు రామన్నతో సహా పలువురు నేతలను అరెస్టు చేశారు. జోగురామన్న తమ పోరాటాన్ని విస్తృతం చేయడంలో భాగంగా ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు మీడియాతో మాట్లాడారు. అన్నదాతలకు సరైన గిట్టుబాటు ధరలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రస్తుత విధానాలకు వ్యతిరేకంగా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. రైతన్నల సమస్యలను గుర్తించి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యలపై తాము పోరాడుతుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తమపై కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. రైతులు సరైన గిట్టుబాటు ధరలేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతలకు న్యాయం చేసేవరకు తాము పోరాడు తామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమం పెద్దఎత్తున జరుగుతున్న సమయంలో పోలీసులు భారీ బలగాలతో ఆర్టీసీ డిపో వద్దకు చేరుకున్నారు. ప్రజల మౌలిక హక్కులపై అడ్డగోలుగా ఇబ్బందులు కలిగించకుండా జాగ్రత్త తీసుకోవాలని వారిని హెచ్చరించారు. అయితే, ఆందోళన చేస్తున్న జోగు రామన్నతో సహా మరికొంతమంది నేతలను అరెస్టు చేశారు. ఈ ఘటనతో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనల నేపథ్యంలో జోగు రామన్నతో పాటు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, గులాబీ శ్రేణులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని మండిపడ్డారు. తాము శాంతియుతం గా ధర్నా చేస్తుంటే పోలీసులు ఎందుకు అరెస్ట్ చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్

సంబంధించి లీజు భూములపై ప్రభుత్వానికి సర్వాధికారులు ఉంటాయని గత ప్రభుత్వం జీవో తెచ్చింది. స్వచ్ఛందంగా ముందుకు వస్తే భూములు కన్వర్ట్ చేస్తాం. నగరవాసులను కాలుష్యం నుంచి రక్షించాలన్నదే మా లక్ష్యం అన్నారు. మా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి హేతుబద్ధత, శాస్త్రీయత ఉండాలని చూస్తున్నాం. భవిష్యత్ గురించి ఆలోచించే మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. మనం ఇన్ఫర్మేషన్ రెవల్యూషన్‌లో ఉన్నామని, అంతరిక్షంలో ఇళ్లు కట్టుకోబోతున్నామని గొప్పలు చెప్పుకుంటున్నాం కానీ, ఈ భూమిపై పుట్టిన జీవికి స్వచ్ఛమైన గాలి, నీరు అందించలేని అసమర్థ నాగరికతలో ఉన్నామనేది చేదు నిజం. అభివృద్ధి పేరిట జరుగుతున్న పర్యావరణ విధ్వంసాన్ని ఆపి, రాబోయే తరాలకు ఒక 'క్లీన్ ఎన్విరాన్ మెంట్'ను అందించడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం 'హిల్ట్' పాలసీకి శ్రీకారం చుట్టిందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. చాలా మంది హిల్ట్ పాలసీని కేవలం పారిశ్రామిక ప్రాంతాలను నివాస ప్రాంతాలుగా మార్చే ఒక సాదాసీదా 'ల్యాండ్ ట్రాన్స్‌ఫార్మేషన్' ప్రక్రియగా చూస్తున్నారు.

## కొడుకు, కుమార్తెను ఉరేసి చెరువులో పడేసిన తండ్రి

**హైదరాబాద్:** పిల్లా,పాపలతో హాయిగా సాగిపోతున్న సంసారంలో కుటుంబ సమస్యలు ఘోర విషాదాన్ని నింపాయి. కొడుకు,కుమార్తెను ఉరేసి చెరువులో పడేశాడో తండ్రి. ఆపై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మరికల్ మండలం తీలేరు గ్రామంలో మంగళవారం ఉదయం ఘోర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురైన శివరాములు తన కూతురు రితిక, కొడుకు చైతన్యను ఉరిసే స్థానిక చెరువులో పడేశాడు. అనంతరం, విద్యుత్ తీగను పట్టుకొని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అప్రమత్తమైన స్థానికులు స్పందించి అతడిని మహబూబ్ నగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. పిల్లల మృతదేహాలను చెరువులో నుండి వెలికితీసి పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో తీలేరు గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సమస్యల కారణంగానే ఈ దారుణానికి పాల్పడినట్లు ప్రాథమిక సమాచారం. గ్రామస్థులు ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, చిన్నారుల అమాయక ప్రాణాలు ఇలా బలైపోవడం పట్ల ఆవేదన చెందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. తీలేరు గ్రామంలో జరిగిన ఈ ఘటన కుటుంబ సమస్యలు ఎంతటి విషాదానికి దారితీస్తాయో మరోసారి స్పష్టంచేసింది. శివరాములు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతుండగా, గ్రామం మొత్తం ఈ దారుణంతో కన్నీటి సంద్రమైంది.

## బ్లో ఔట్‌పై సిఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

**అమరావతి:** బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండ బ్లో అవుట్ ప్రమాదంపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం సమీక్ష నిర్వహించారు. బ్లో అవుట్ ప్రాంతంలో ప్రస్తుత పరిస్థితిని ముఖ్యమంత్రికి ఉన్నతాధికారులు వివరించారు. గ్యాస్ లీక్‌ను అరికట్టేందుకు వివిధ విభాగాలు తీసుకుంటున్న చర్యలను సీఎస్ విజయానంద్, హోంమంత్రి అనిత, పోలీసు ఉన్నతాధికారులు, సీఎంవో సహా ఇతర అధికారులు వివరించారు. ప్రమాద స్థలంలో ప్రస్తుత పరిస్థితి, ప్రజల రక్షణకు తీసుకున్న చర్యలను ముఖ్యమంత్రికి తెలియజేశారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ఆయా గ్రామాల ప్రజలకు అందుతున్న సహాయ చర్యలపైనా అధికారులతో సీఎం మాట్లాడారు. ఇలాంటి ప్రమాదాలు జరిగిన సందర్భంలో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతారని... వారికి ఎప్పటికప్పుడు వాస్తవ పరిస్థితిని వివరించి అండగా నిలవాలని సూచించారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఇళ్లు, ఊళ్లు వదలిన వారు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందని చెప్పారు. మంటల కారణంగా కొబ్బరి చెట్లు కాలిపోయిన వారికి, ఇతరత్రా నష్టం జరిగిన వారికి నష్టపరిహారం అందించే చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. మంటలను అరికట్టేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవసరమైన ఏజెన్సీల సహాయాన్ని తీసుకోవాలని సూచించారు. సాధారణ పరిస్థితి నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందించాలని సూచనలు చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి తరహా ఘటనలు తలెత్తకుండా ఓఎన్‌జీసీ సహా ఇతర భాగస్వామ్య సంస్థలతో త్వరలో సమావేశ నిర్వహణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

## ఎసిబికి చిక్కిన మరో లంచావతారం

**కామారెడ్డి:** కామారెడ్డి జిల్లాలో తహసీల్దార్ ఏసీబీ వలలో చిక్కాడు. రూ. 50 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. నాగిరెడ్డిపేట మండల తహసీల్దార్గా పనిచేస్తున్న యార్లగడ్డ శ్రీనివాస్ రావుతో పాటు లంచం తీసుకోవడంతో మధ్యవర్తిగా వహించిన ప్రైవేట్ వ్యక్తి చినూరు అజయ్ అనే వ్యక్తిని పట్టుకున్నారు.మండలానికి చెందిన ఓ వ్యక్తి తన తండ్రి పేరుపై ఉన్న వ్యవసాయ భూమిని తన పేరు మీద బదిలీ చేయాలని కోరగా అందుకు లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ నేతృత్వంలో సిబ్బంది కార్యాలయంపై మాటు వేసి తహసీల్దార్ లంచం తీసుకుంటుండగా దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరిని నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## సింగరేణి భూ సేకరణ వ్యవహారం

**పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బుధవారంపేట గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. రామగుండం 3 ఏరియా ఓసీపీ 2 విస్తరణలో భాగంగా సింగరేణి యాజమాన్యం భూసేకరణ పనులను ప్రారంభించడంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా.. ఎలాంటి నోటీసులు జారీచేయకుండానే ఇండ్లను కూల్చివేశారని బాధితులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కొద్దిరోజుల క్రితమే బుధవారంపేటలో ఉన్న పాత నిర్మాణాలకు ఇంటి నెంబర్లు కేటాయించిన అధికారులు, కొత్తగా వెలిసిన ఇండ్లకు అనుమతి ఇవ్వకుండా ఆదేశాలిచ్చారు.బుధవారంపేట గ్రామాన్ని పూర్తిగా సింగరేణి సేకరించాలని, లేదంటే పనులను అడ్డుకుంటామని గ్రామస్తులు హెచ్చరించినా కొద్ది రోజులుగా ఆ గ్రామంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో మంగళవారం రామగిరి పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్, రెవెన్యూ, సింగరేణి అధికారుల సమక్షంలో అక్రమ కట్టడాలనే నెపంతో బుధవారంపేటలోని పలువురు బాధితుల ఇండ్లను కూల్చివేశారు. 'అయితే ఈ కూల్చివేతకు ముందు తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని, ఆ ఇండ్ల వద్ద ఎవరులేని సమయంలోనే అధికారులు యంత్రాలతో ఇళ్లను నేలమట్టం చేశారని బాధితులు వాపోయారు. దాంతో ఆగ్రహించిన బుధవారంపేట గ్రామస్తులు మంథని?పెద్దపల్లి ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. సొంత పట్టా భూముల్లో ఇండ్లు నిర్మించుకుంటే ఎలా అక్రమమవుతాయి? నోటీసులు లేకుండా కూల్చివేతకు ఎవరు అనుమతి ఇచ్చారు?' అంటూ బాధితులు అధికారులను ప్రశ్నించారు.'జిల్లా కలెక్టర్ స్వయంగా అక్కడే ఉండి కూల్చివేతకు ఆదేశాలు ఇచ్చారని ఆరోపిస్తూ, కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పేవరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. ధర్నా కారణంగా మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న గోదావరిఖని వన్, టూ టౌన్ సీఐలు, ఎస్సైలు శ్రీనివాస్, దివ్యతోపాటు స్పెషల్ పార్టీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులతో చర్చలు జరిపారు. అయినప్పటికీ బాధితులు తమ ఆందోళనను విరమించేందుకు ససేమిరా అన్నారు.దనంతరం గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను శాంతింపజేస్తూ సానుకూలంగా చర్చలు జరిపారు. తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళనను విరమించారు. అయితే నోటీసులు లేకుండా, బాధితులకు సమాచారం ఇవ్వకుండా జరిగిన కూల్చివేతపై సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని గ్రామస్తులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## రాయలసీమ లిఫ్ట్‌ను ఆపింది ఎన్‌జిటి

**హైదరాబాద్**: 90 శాతం పూర్తయిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఎవరూ ఆపలేదని, నేషనల్ గ్రీన్ ట్రైబ్యున్(ఎన్జీటీ) ఆపిందని జలశక్తి శాఖ మాజీ సలహాదారు వెదిరె శ్రీరాం అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో కృష్ణా-గోదావరి నదీ జలాల కేటాయింపులపై వెదిరే శ్రీరామ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.2014 నుంచి 2024 వరకు తెలంగాణ లిఫ్ట్ చేసిన నీటి కన్నా ఆంధ్రప్రదేశ్ ఎక్కువ నీటిని తరలించింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకి హైడ్రాలిక్ క్లియరెన్స్, ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ లేవు. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌ను.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు, ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కూడా కేంద్ర ప్రభుత్వం వెనక్కి పంపింది. సరైన వివరాలు ఇవ్వకపోవడంతో కేంద్రం తిప్పి పంపింది. ఇవ్వాల్సిన.. లీగల్, టెక్నికల్ డేటా ఇస్తే 45 టీఎంసీల నీటి వినియోగానికి అనుమతి వస్తుంది. మిగతా 45 టీఎంసీల కోసం ట్రైబ్యునల్‌లో గట్టిగా వాదిస్తే అనుమతులు వస్తాయి. 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం జీవోలు ఇచ్చింది.. కానీ, నీటి కేటాయింపులు మాత్రం చేయలేదు. ఆ తరువాత కేసీఆర్ 299 టీఎంసీలకు సంతకం చేసి.. తెలంగాణకు వచ్చిన అవకాశాన్ని కోల్పోయారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చిత్తశుద్ధిలేదు. ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదు. దీనికి కేసీఆర్ ఏం సమాధానం చెబుతారు. కేఆర్ఎంబీ కొత్తగా నీటి కేటాయింపులు చేయదు' అని పేర్కొన్నారు.

# శ్రీశైలం దేవస్థానంలో12 నుంచి మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు



**నంద్యాల జిల్లా శ్రీశైలం జనవరి 6 (గ్రామ దండోరా న్యూస్):**జనవరి 12 నుండి 18 వరకు మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు. బ్రహ్మోత్సవాలలో లోకకార్యర్థమై విశేష పూజలు, వాహన సేవలు, హోమాలు, జపాలు, పారాయణలు. జనవరి 15 సంక్రాంతి రోజున బ్రహోత్సవ కల్యాణం. బ్రహోత్సవ కల్యానోత్సవానికి చెంచుగిరిజనులకు ప్రత్యేక ఆహ్వానం.మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకొని జనవరి 12వ తేదీ నుండి 18 తేదీ వరకు హో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. పంచాహ్నికదీక్షతో ఏడురోజులపాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు ఈ నెల 18వ తేదీన ముగియనున్నాయి. సంప్రదాయాన్ని అనుసరించి శ్రీ మల్లికార్జున స్వామివారికి ఏటా రెండుసార్లు అనగా మకర సంక్రమణం సందర్భంగా సంక్రాంతి బ్రహ్మోత్సవాలు మరియు మహాశివరాత్రి సందర్భంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

**బ్రహ్మోత్సవ కార్యక్రమాలు**

ఈ బ్రహ్మోత్సవాల ప్రారంభంగా 12.01.2026ఉదయం గం. 9.15 లకు శ్రీస్వామివారి యాగశాల ప్రవేశ కార్యక్రమం నిర్వహించబడుతుంది. అనంతరం లోకకల్యాణాన్ని కాంక్షస్తూ అర్చకస్వాములు బ్రహ్మోత్సవ సంకల్పాన్ని పఠిస్తారు. సంకల్ప పఠనం తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని గణపతి పూజ జరిపించబడుతుంది. గణపతి పూజ తరువాత వృద్ధి, అభ్యుదయాల కోసం స్వస్తి పుణ్యాహవాచనం జరిపించబడుతుంది. ఈ కార్యక్రమాల తరువాత బ్రహ్మోత్సవ నిర్వహణకు ఆధ్వర్యం వహించే శివపరివార దేవుడైన చండీశ్వరునికి విశేషపూజలు జరిపించబడతాయి. అనంతరం కంకణధారణ, ఋత్విగ్వరణం, అఖండదీపారాధన, వాస్తుపూజ, వాస్తుహోమం, మండపారాధనలు, కలశస్థాపన, పంచా వరణార్చనలు, జపానుష్ఠానములు, పారాయణలు నిర్వహించ బడతాయి.12వ తేదీ సాయంకాలం 5.00 గంటల నుండి అంకురారోపణ, అగ్నిప్రతి ష్ఠాపనల కార్యక్రమాలు జరిపించబడుతాయి. తరువాత సాయంత్రం 7.00గంటల నుండి ధ్వజారోహణ, ధ్వజపటావిష్కరణ ఆయా కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ముక్కోటిదేవతలను, సకల సృష్టిని బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకుగాను ఈ ధ్వజారోహణ కార్యక్రమం జరిపించబడుతుంది. బ్రహ్మోత్సవాలలో భాగంగానే ప్రతిరోజు శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు, మండపారాధనలు, పంచావరణార్చనలు, రుద్రహోమం, చండీహోమం, నిత్యహవనాలు జరిపించబడతాయి. బ్రహ్మోత్సవాలలో రెండవ రోజు నుండి అనగా 13వ తేది నుండి శ్రీస్వామిఅమ్మవార్లకు వాహన సేవలు నిర్వహించబడుతాయి.15వ తేదీ మకరసంక్రాంతి రోజున బ్రహ్మోత్సవ కల్యాణం జరిపించబడుతుంది.17వ తేదీ ఉదయం యాగపూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం నిర్వహించబడుతాయి. సాయంత్రం సదస్యం, నాగవల్లి, ధ్వజావరోహణ నిర్వహించబడుతాయి. బ్రహ్మోత్సవాలలో చివరిరోజైన 18వ తేదీ రాత్రి జరిగే పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవలతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి.తేది వాహన సేవ / విశేష కార్యక్రమము 12.01.2026 అంకురార్పణ, ధ్వజారోహణ 13.01.2026 భృంగివాహనసేవ 14.01.2026 కైలాసవాహనసేవ 15.01.2026 నందివాహనసేవ , బ్రహ్మోత్సవ కల్యాణం 16.01.2026 రావణవాహనసేవ,17.01.2026 పూర్ణాహుతి, త్రిశూలస్నానం, సదస్యం,నాగవల్లి, ధ్వజావరోహణ 18.01.2026 అశ్వవాహన సేవ ( ఆలయ ఉత్సవం)పుష్పోత్సవం, శయనోత్సవంకాగా సంక్రాంతి రోజున (జనవరి 15 జరిగే బ్రహోత్సవాలలో కల్యాణానికి చెంచుగిరిజన భక్తులను ప్రత్యేకంగా ఆహ్వానిచడశీ జరుగుతోంది.

**కొన్ని ఆర్జిత సేవలు నిలుపుదల**

ఉత్సవాల సందర్భంగాఈ నెల 12వ తేదీ నుండి 18వ తేదీ వరకు ఆర్జిత ప్రత్యక్ష మరియు పరోక్షసేవలైన రుద్రహోమం, చండీహోమం, మృత్యుంజయహోమం, గణపతి హోమం, (పరోక్షసేవ) శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణం మరియు శ్రీ స్వామిఅమ్మవార్లకల్యాణం, ఉదయాస్తమానసేవ, ప్రాత:కాలసేవ, ప్రదోషకాలసేవ, ఏకాంతసేవలను నిలపుదల చేయబడ్డాయి.

# చేబర్తి గ్రామంలో శ్రీరామరక్ష పుస్తకాల పంపిణి చేసిన





### భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు

### రామకోటి రామరాజును సన్మానించిన చేబర్తి భక్త బృందం

### నేటి నుండి భజన శ్రీకారం చుట్టిన భక్త బృందం

**సిద్దిపేట జిల్లా, గ్రామ దండోరా:** భద్రాచల దేవస్థానం నుండి వచ్చిన శ్రీరామరక్ష స్తోత్ర పారాయణ పుస్తకాలను, తలంబ్రాలను శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు మంగళవారం నాడు హనుమాన్ భక్త బృందం సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామనామం అమోగమైనదని, రాముడు లోకానికి ఆదర్శ పురుషుడని, ప్రతి ఒక్కరు రామ నామాన్ని స్మరించాలని భక్తులకు పిలుపునిచ్చారు. ప్రతి రోజు శ్రీరామరక్ష స్తోత్రం పారాయణం చేయాలన్నారు. మార్కుక్ మండలం చేబర్తి గ్రామంలో హనుమాన్ దేవాలయం సుందరంగా ఉందన్నారు. భజన అనేది అక్కడ లేకపోవడం బాధ కలిగించిందని, ఈరోజు నుండి ప్రతి మంగళవారం హనుమాన్ దేవాలయంలో భజన ఉంటుందని తెలియజేశారు. ప్రతి మంగళవారం భజన కార్యక్రమాలు నిర్వహించాలని హనుమాన్ భక్తులచే భజనకు శ్రీకారం చుట్టారు. భగవంతుడు సేవకు మించిన భాగ్యం ప్రపంచంలో మరొకటి లేదన్నారు. అనంతరం రామకోటి రామరాజు చేస్తున్న ఆధ్యాత్మిక సేవలు అమోఘం అని కొనియాడిన హనుమాన్ భక్త బృందం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్త బృందం సభ్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# న్నర్ రింగ్ రోడ్డు, స్మార్ట్ సిటీ, రైల్వే బ్రిడ్జి

### నేటినుంచి అమరావతి భూసేకరణ: నారాయణ

**అమరావతి:** రాజధాని అమరావతిలో ఇన్నర్ రింగ్ రోడ్డు, స్మార్ట్ సిటీ, రైల్వే బ్రిడ్జి కోసం నేటి నుంచి భూ సమీకరణ చేపడు తున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఎంద్రాయి, వడ్డమాను నుంచి రెండో దశ భూసమీకరణ చేపడతామని వెల్లడించారు. సీఆర్డీఏలో కొత్తగా 754 పోస్టుల మంజూరుకు ఆమో దం తెలిపినట్లు మంత్రి వివరించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, డిప్యుటేషన్ ప్రాతి పదికన వీటిని భర్తీ చేస్తామని తెలిపారు. ఏడుగురు మైనర్లకు ఫించను ఇచ్చేందుకు అథారిటీ అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు లేని అనాథలకు నిబంధనలు సడలించి ఫించను మం జూరుకు ఆమోదించినట్లు తెలిపారు. రైతులు చెప్పిన.. రోడ్ హిట్ సమస్య పరిష్కరించేందుకు నిర్ణయం తీసుకు న్నామన్నారు. 112 ఫిర్యాదులు రోడ్డు సూల సమస్యకు సంబంధించి ఉన్నాయని వివరి ంచారు. కృష్ణా నదిలో ఎకరా స్థలంలో మెరీనా ఏర్పాటుకు సీఆర్డీఏ ఆమోది ంచినట్టు స్పష్టం చేశారు. సీడ్ యాక్సిస్ రోడ్డుపై నాలుగున్నర ఎకరాల భూ సేక రణకు నోట ిఫికేషన్ ఇస్తున్నామన్నారు. సమీ కరించిన భూముల్లో మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరుగుతోందని మంత్రి తెలిపారు

## ర్యాంకులే చదువుకలు కొలమానం కాదు

**హైదరాబాద్:** ఇటీవల బడికి వెళ్లేందుకు సిద్ధం కావాలని తల్లిదండ్రులు చెప్పడంతో అందుకు ఇష్టంలేని బాలుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ లిమిట్స్ లో జరిగింది. అయితే తల్లిదండ్రులు పిల్లపై ఒత్తిడి పెంచరాదని సైబరాబాద్ పోలీసులు సూచించారు. ఇది తీవ్ర ప్రభావంచూపుతుందన్నారు. చదువుల ఒత్తిడితో ఇక జీవితంలో ఏమీ లేదననే రీతిలో విద్యార్థులు తమకు తాముగా మరణ శాసనం రాసుకుంటున్నారు. జీవితంలో పరీక్షలు అనేవి ఒక భాగం మాత్రమే అని.. పరీక్షలే జీవితం కాదు. కేవలం చదువే జీవితం కాదు. చదువు లేకున్నా విషయజ్ఞానాన్ని, హార్డ్ వర్క్, ప్యాషన్ ను నమ్మి ఎంతో మంది జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. నిరుపేద కుటుంబంలో పుట్టి.. చెప్పులు కుడుతూ వీధి దీపాల కింద చదివి అబ్రహాం లింకన్ అమెరికన్ ప్రెసిడెంట్ అయ్యారు. జీవితంలో పెద్దగా చదువు లేనప్పటికీ పట్టుదల, కృషి ఉంటే గొప్పవారు కావచ్చని శ్రీనివాస రామానుజన్, రజనీకాంత్, నవాజుద్దీన్ సిద్దికీ, మార్క్ ట్వెయిన్, స్టీవ్ జాబ్స్, షేక్ స్పియర్, మైఖేల్ ఫారడే, గ్రెగర్ మెండల్, విన్ స్టన్ చర్చిల్, అబ్రహాం లింకన్, ఆల్బర్ట్ ఐన్ స్టీన్ తదితరులు నిరూపించారు. ర్యాంకులు, మార్కులు, తోటి విద్యార్థులతో పోలికలు.. ఇవన్నీ కలగలిపి విద్యార్థులను తీవ్రమైన ఒత్తిడిలోకి నెట్టేస్తున్నాయి. బతకడం కోసం, విజ్ఞానం కోసం నేర్చుకోవాల్సిన చదువులు.. యువతను మానసిక ఒత్తిడికి గురిచేసి వారిని ఆత్మహత్యల వైపు నడిపిస్తుండడం బాధాకరం. ర్యాంకుల కోసం నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. దేశమంతటా వెలుగుచూస్తున్న విద్యార్థుల బలవన్మరణాలు సామాజిక రుగ్మతగా పరిణమిస్తున్నాయి. చదువు మనిషిని సంస్కరించాలి.. చదువు జీవన వికాసానికి ఉపయోగపడాలి కానీ జీవన వినాశనానికి కాదు. ÷ఖవితంలోనైనా, ఆటలోనైనా గెలుపోటములు సహజం. ఓటమిని చూసి భయపడొద్దు.. అధైర్యపడొద్దు, క్రుంగిపోవద్దు. ఆత్మన్యూనత భావానికి లోనూ కావద్దు. అపజయం నుంచి నేర్చుకొని బౌన్స్ బ్యాక్ కావాలి. వైఫల్యాలే రేపటి విజయానికి బంగారు బాటలు).చరిత్రలో గొప్పగొప్ప వాళ్లంతా ఓటమి రుచి చూసిన వారే. ఓటమి ఎన్నో గెలుపు పాఠాలను నేర్పుతుంది. తాము ఎక్కడ తప్పు చేస్తున్నామని ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. మిక్కీమౌస్ క్యారెక్టర్ సృష్టికర్త వాల్ట్ డిస్నీ, అబ్రహాం లింకన్, బల్బు కనిపెట్టిన థామస్ ఆల్వా ఎడిసన్, టెలిఫోన్ కనిపెట్టిన అలెగ్జాండర్ గ్రాహంబెల్, విమానాన్ని కనిపెట్టిన రైట్ బ్రదర్స్ , పర్వాతారోహకుడు టెంజింగ్ నార్గే తదితరులందరూ ఓటమిని ఒప్పుకోలేదు.. మళ్లీ మళ్లీ ప్రయత్నించి తాము అనుకున్న లక్షాలను సాధించారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకువెళ్లాలి. భవిష్యత్తు గురించి ప్రణాళికలు రచించుకోవాలి.

# ముసాయిదా ఓటరు జాబితాలో పొరపాట్ల సవరణకు చర్యలు

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్





**గ్రామ దండోరా, మంచిర్యాల.జనవరి 6, 2026:**మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలో పొరపాట్ల సవరణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, డిప్యూటీ ట్రైనింగ్ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపై ఏవైనా అభ్యంతరాలు, పొరపాట్లు ఉన్నట్లయితే మున్సిపల్ కమిషనర్ కు రాతపూర్వకంగా అందించినట్లయితే సవరించే ందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని మున్సిపాలిటీ లు, మున్సిపల్ కార్పొరేషన్ లో మొత్తం 149 వార్డులకు గాను, 2 లక్షల 94 వేల 641 మంది ఓటర్లు ఉన్నారని, ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 264, లక్షట్టిపేట మున్సిపాలిటీలో 30, బెల్లంపల్లి మున్సిపాలిటీలో 68, చెన్నూరు మున్సిపాలిటీలో 36, క్యాతనపల్లి మున్సిపాలిటీలో 45 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, పోలింగ్ కేంద్రాల విషయంలో అభ్యంతరాలు ఉన్నట్లయితే వెంటనే తెలియజేయాలని తెలిపారు. డి లిమిటేషన్ ప్రక్రియలో నిర్ధారణ చేసిన హద్దుల ప్రకారమే ముసాయిదా ఓటరు జాబితా రూపొందించడం జరిగిందని, మార్పులు ఏమైనా ఉన్నట్లయితే సరి చేయడం జరుగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రాలకు తమ పార్టీల నుండి బూత్ స్థాయి ఏజెంట్లను ఏర్పాటు చేయాలని, తమ పరిధిలో డబల్ ఓట్ల సంబంధిత సమాచారం ఈ ఆర్ ఓ లకి ఇవ్వాలని, డబల్ ఓట్లు ఉన్నట్లయితే ఎ.డి.ఎస్. (ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్) జాబితా ద్వారా ద్వారా ఓటు దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీన ప్రచురించబడిన ఓటరు జాబితా ప్రకారమే ముసాయిదా జాబితా తయారు చేయడం జరిగిందని, ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ముసాయిదా ఓటరు జాబితాపై అందిన దరఖాస్తులను, అభ్యంతరాలను పరిశీలించి ఈ నెల 10వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని, జాబితా తయారీలో బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు సమన్వయంతో పని చేసి స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కోకాపేటలో తోక జాడిస్తున్న కబ్జాసురులు

**కోకాపేటలో రూ.10కోట్ల విలువైన భూమి కబ్జా**

**అధికారుల విచారణలో బయటపడ్డ అసలు నిజం**

**తెరవెనుక మాజీ తహసీల్దార్, ఇద్దరు మాజీ కౌన్సిలర్లు**






**హైద్రాబాద్:** గ్రామ దండోరా బ్యూరో :సర్కారు స్థలాల్లో గుడిసెలు, చిన్న ఇళ్లు కట్టుకుని క్రమబద్ధీకరించుకున్న వారి వివరాలను సేకరిస్తున్న అధికారులకు నకిలీపట్టాల బండారం బయట పడింది. పూర్తిగా విచారణ చేపట్టగా ఏకంగా అప్పటి జిల్లా కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి పట్టాలను సృష్టించారని తేలడంతో అధికారులు అవాక్కయ్యారు. రంగారెడ్డి జిల్లా గండిపేట రెవెన్యూ మండలం కోకాపేట గ్రామ సర్వేనంబరు 147లో గతంలో ప్రభుత్వం 80 గజాల చొప్పున అర్హులైన పేదలకు 2006లో ఇండ్ల పట్టాలను మంజూరు చేసింది. ఈ ప్రాంతంలో చాలామంది పేదలు ఇండ్లు కట్టుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ సర్వే నంబర్‌లోనే కొన్ని కుల సంఘాలకు అప్పట్లో సర్కారు కమ్యూనిటీ హాళ్లు నిర్మించుకునేందుకు కేటాయింపులు చేసింది. ఇదిలావుండగా మంజూరు చేసిన ఇంటి పట్టాల కన్నా రెట్టింపు స్థాయిలో కొందరు కబ్జాలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కొంతమంది వ్యక్తులు సర్వేనంబర్ 147లో 80 గజాల చొప్పున కొన్ని ప్లాట్లకు మార్కింగ్ వేసి ఇండ్లు కట్టుకుంటున్నారు. అధికారులు ఆ పట్టాలను పరిశీలించగా జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన హరీష్ సంతకంతో జారీచేసిన పట్టాగా గుర్తించారు. ఫోరెన్సిక్ పరీక్ష చేయించగా, ఆ కలెక్టర్ సంతకం కాదని తెలిసింది. నిజానికి అప్పట్లో ఇండ్ల పట్టాలనే కేటాయించలేదని తేలింది. ఈ వ్యవహారం వెనుక కోకాపేట గ్రామానికి చెందిన ఓ మాజీ కౌన్సిలర్, నార్సింగి గ్రామానికి మరో మాజీ కౌన్సిలర్ ఇద్దరు కలిసి ఎనిమిది(8) నకిలీ పట్టాలను సృష్టించి దాదాపు వెయ్యి గజాల ప్రభుత్వ స్థలాన్ని వేర్వేరుగా కబ్జాలు చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వీరికి గత తహసీల్దార్ వెన్నంటే ఉండి ఈ వ్యవహారాన్ని చక్కదిద్దినట్లు తెలిసింది. కోకాపేటలో గజం ధర రూ. 1.50లక్షలు నుంచి రూ. 2లక్షల వరకు పలుకుతున్న విషయం అందరి తెలిసిందే. సుమారు రూ.10కోట్ల విలువైన సర్కారు స్థలాన్ని నకిలీ పట్టాలను సృష్టించి క్రయవిక్రయాలు జరిపినట్లుగా ఇటీవల గండిపేట రెవెన్యూ అధికారులు చేపట్టిన విచారణలో బయటపడినట్లు తెలిసింది. గతంలో గండిపేటలో తహసీల్దారుగా విధులు నిర్వహించి పదవీ విరమణ అయిన ఆ అధికారి పుప్పాలగూడలోని నెమలినగర్ కాలనీ సమీపంలోని 60 గజాల కాలనీలోనూ ఈ ఇద్దరు మాజీ కౌన్సిలర్లతో మరో వెయ్యి గజాల స్థలాన్ని ఓ కుల సంఘం పేరుతో నకిలీ పట్టాలను సృష్టించి విక్రయాలు చేసినట్లు సమాచారం. కాగా, కోకాపేట సర్వేనంబరు 147లో నకిలీ పట్టాలుగా రెవెన్యూ అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై నార్సింగి పోలీసులకు గండిపేట రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయండి

**గ్రామ దండోరా తెలుగు దినపత్రిక జూలూరుపాడు జనవరి 06 ప్రతినిధి సురేంద్ర:** బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబుభారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావు జనవరి 7వ తేది బుధవారం ఉదయం 10:00 గం:లకు ఖమ్మం జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు మంగళవారం జూలూరుపాడు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ఈ పర్యటనలో భాగంగా ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులకు (సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు) ఆత్మీయ అభినందనసభ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈసభలో ముఖ్యఅతిథిగా కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) గారు పాల్గొని గ్రామ ప్రజాప్రతినిధులను శాలువాతో సత్కరించి, అభినందిస్తారన్నారు. ఈ సభకు వైరా నియోజకవర్గ పరిధిలోని. మండల అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు ఎంపీటీసీలు మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ శాఖ అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయవలసిందిగా గిరిబాబు కోరారు



## కవిత కాంగ్రెస్‌లో చేరినా ఆశ్చర్యం లేదు

**హైదరాబాద్:** ఎమ్మెల్సీ కవితపై కాంగ్రెస్ నాయకుడు మల్‌రెడ్డి రంగారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరినా ఆశ్చర్యపోనవసరం లేదన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి స్వీట్ వార్నింగ్ కూడా ఇచ్చారు. మల్‌రెడ్డి రంగారెడ్డి మంగళవారం నాడు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న కవిత ఎపిసోడ్‌పై స్పందించారు. కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదన్నారాయన. దానం నాగేందర్, కడియం శ్రీహరి తమ పార్టీలోకి వస్తారని ఊహించలేదని.. చివరికి వారు వచ్చారు కదా అని ఉదహరించారు మల్‌రెడ్డి. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి కూడా చిన్నపాటి వార్నింగ్ ఇచ్చారు. మల్‌రెడ్డి రంగారెడ్డి ఎప్పటి నుంచో మంత్రి పదవి ఆశిస్తున్నారు. హైదరాబాద్ కోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని పలుమార్లు బహిరంగంగానే అడుగుతూ వచ్చారు. ఇప్పుడు కూడా అదే అంశాన్ని ఆయన ప్రస్తావించారు. తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే పార్టీకే నష్టం కలుగుతుందని పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. పార్టీ పెద్దలు ఆలోచించాలని కోరారు. రెండు కోట్ల మంది ప్రజలు ఉన్న జిల్లాకు ఇంత వరకు మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. రంగారెడ్డి జిల్లా పేరు మార్పుపైనా ఆయన స్పందించారు. పేరు మార్పు తనకు ఇష్టం లేదన్నారు. రంగారెడ్డి జిల్లా పేరు మార్పు అనేది కేవలం ఊహాగానమే అని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లాలో ఎన్ని మున్సిపాలిటీలు అయినా చేసుకోవచ్చని.. జిల్లా స్వరూపం మాత్రం మారొద్దని ప్రభుత్వాన్ని మల్‌రెడ్డి కోరారు. ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో రియల్ భూమ్ పెరిగిందన్నారు.

# ప్రగతి స్కూల్ చేస్తున్న పార్కు కబ్జాలపై డిప్యూటీ కమిషనర్ సానుభూతి.. ఆకుల సతీష్






**నిజాంపేట్ గ్రామ దండోరా ప్రతినిధి జనవరి 6:** నిజాంపేట్ సర్కిల్ పరిధిలో ప్రగతి నగర్ నందు 178,179 ప్రగతి స్కూల్ పక్కన మూడు ఎకరాల పార్కులో ఆక్రమణలు తొలగించి పార్కును అభివృద్ధి చేయాలని మరియు విష్ణుప్రియ లేఔట్ నందు రెండు వేల గజాల పార్క్ స్థలంలో ఆక్రమణలు తొలగించి అభివృద్ధి చేయాలని టౌన్ ప్లానింగ్ ఏసిపికి కలిసి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ సర్వే నెంబరు 178,179 మూడు ఎకరాల్లో పార్క్ స్థలాన్ని కూడా దాని నందు ప్రగతి స్కూల్ వర్కర్స్ కోసం షెడ్ల నిర్మాణం మరియు అభివృద్ధి చేయకుండా పలుమార్లు ఫిర్యాదు చేసిన కమిషనర్ స్పందించకపోవడం ఆక్రమణలో తొలగించకపోవడం మరియు స్విమ్మింగ్ పూల్ ని అభివృద్ధి చేయకపోవడంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని , అదేవిధంగా ప్రగతి నగర్ విష్ణు ప్రియ లేఔట్ లో సర్వేనెంబర్ 158, 159 హెచ్ఎండిఏ అప్రూవడ్ లేఔట్ నందు రెండు వేల గజాల పార్క్ స్థలంలో ఆక్రమించుకొని 15 షాపుల నిర్మాణం పై తక్షణమే చర్యలు తీసుకొని కాంపౌండ్ వాల్ నిర్మించాలని మరియు పార్కు నందు చెత్తాచెదారం శుభ్రం చేసి ప్రజా వినియోగంలోకి తేవాలని గతంలో కమిషనర్ కు పలుమార్లు ఫిర్యాదు చేసిన నామమాత్రపు చర్యలు తీసుకొని కబ్జాదారులకు సహకరించడం , కమిషనర్ కి పార్కుల పరిరక్షణ పట్ల చిత్తశుద్ధి లేదని అర్థమవుతుందని, అందుకే కమిషనర్ కు ఫిర్యాదు చేయడం లేదని టౌన్ ప్లానింగ్ ఏసిపి కి ఫిర్యాదు చేశామని, తక్షణమే పార్కుల కబ్జాలపై చర్యలు తీసుకొని, పార్కులను అభివృద్ధి చేసి ప్రజా వినియోగ తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, ఈశ్వర్ రెడ్డి, అరుణ్ రావు, మాధవరావు, పండు తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్ సమీపంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న సీఐ గంట సుబ్బారావు..!

**శ్రీశైలం ప్రాజెక్టు సుండిపెంట జనవరి 6 (గ్రామ దండోరా న్యూస్):** సున్నిపెంట వరుస రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున ఆత్మ కూర్ డి.ఎస్.పి ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని డిఎస్పి ఆదేశాల మేరకు ఎలాంటి ప్రమా దాలు జరగకుండా చూసుకునేందుకు సున్నిపెంట సీఐ గంట సుబ్బారావు ప్రమా దాలు జరగకుండా ఉండేందుకు హైదరా బాదు నుంచి శ్రీశైలంవచ్చే వారికి అవగా హన కల్పిస్తూ సీట్ బెల్ట్ డ్రైవింగ్ లైసెన్స్ ఆర్ సి మొదలగు పేపర్లన్నీ వెహికల్ లలో ఉంచుకోవాలని బైకుల్లో హెల్మెట్ కచ్చితంగా పెట్టుకోవాలి అనేక రకాలుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు రాష్ట్రం దాటి శ్రీశైల దేవ స్థానానికి దర్శ నార్థం వస్తు ఉండడంతో వాహ నాలలో ప్రయా ణం చేసే వారికి అవగాహన కార్య క్రమం నిర్వ హించడం జరుగు తోందని, ఆర్టీసీ బస్సులు రోడ్డు ప్రమాదాలకు గురై పదుల సంఖ్యలో ప్రయా ణీకులు మృత్యువాత పడుతుండటంతో వాహనాలను తనిఖీల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహి స్తున్నామని సర్కిల్ ఇన్స్పెక్టర్ వారి సిబ్బందితో కలిసి ఈ స్పెషల్ డ్రైవ్ కార్య క్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు,,



## అమెరికా అలా చేసిందంటే మనకు దెబ్బే..

భారత్‌పై అమెరికా మరిన్ని టారిఫ్‌లు విధిస్తే అగ్రరాజ్యానికి మన ఎగుమతులపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. దీనితో ఎగుమతిదార్లు మరింత వేగంగా ఇతర మార్కెట్లకు ఎగుమతులను పెంచుకోవాల్సి వస్తుందని వివరించారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్నందున భారత్‌పై మరిన్ని టారిఫ్‌లు విధిస్తానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో నిపుణులు ఈ మేరకు తమ అభిప్రాయాలు తెలిపారు. 2025 మేఉనవంబర్ మధ్య కాలంలో అమెరికాకు భారత్ ఎగుమతులు 20.7 శాతం తగ్గాయని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) పేర్కొంది. మన ఎగుమతులపై ఇప్పటికే 50 శాతం టారిఫ్‌లు అమలవుతుండగా వాటిని ఇంకా పెంచితే, ఎగుమతులు మరింత భారీగా పడిపోవచ్చని వివరించింది. 'చైనా తరహాలో అమెరికాపై భారత్‌కి పైచేయేమీ లేదు. నిజానికి రష్యా క్రూడాయిల్‌ని చైనాయే అత్యధికంగా కనుగోలు చేస్తోంది. కానీ పరిణామాలకు భయపడి దాని గురించి అమెరికా పట్టించుకోవడం లేదు. భారత్ మాత్రం అమెరికా నుంచి పెట్రోలియం క్రూడ్, ఇతర ఉత్పత్తుల దిగుమతులను పెంచుకుంది. కానీ దీన్ని అమెరికా పట్టించుకోదు' అని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు.

## టిక్కెట్ ధరలు పెంచుకునే అవకాశం ఇవ్వండి

**హైదరాబాద్:** సంక్రాంతి కానుకగా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నాయి పలు తెలుగు చిత్రాలు. ముఖ్యంగా అగ్ర కథానాయకుడు ప్రభాస్ 'ది రాజాసాబ్', చిరంజీవి 'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్రాలు వరుసగా ఒకదాని తర్వాత ఒకటి విడుదల కానున్నాయి. భారీ బ్జడెట్‌తో రూపొందిన ఈ చిత్రాల టికెట్ ధరలు పెంచుకునేందుకు అవకాశం కల్పించాలంటూ ఇప్పటికే తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను కోరాయి. ఈ క్రమంలో రెండు చిత్రాల నిర్మాతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోల అనుమతి కోసం అప్పీలు దాఖలు చేశారు. టికెట్ ధరలు పెంచకుండా గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేశారు. ఆ ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని కోరారు. టికెట్ ధరల పెంపు, ప్రత్యేక షోలకు కోసం హోంశాఖ కార్యదర్శికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఆ విజ్ఞప్తిని పరిశీలించేలా హోంశాఖ కార్యదర్శికి సూచించాలని కోరారు. అత్యవసర పిటిషన్ కింద విచారణకు స్వీకరించాలని నిర్మాతల తరపు న్యాయవాదులు కోరగా, అందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ పిటిషన్లపై బుధవారం విచారణ చేయనున్నట్లు తెలిపింది. మరోవైపు 'ది రాజాసాబ్' చిత్ర బృందం ఇప్పటికే టికెట్ ధరల పెంపు విషయమై హోంశాఖ కార్యదర్శికి దరఖాస్తు చేసుకుంది. జనవరి 9న ఈ చిత్రం విడుదల కానుండగా, ఒకరోజు ముందుగానే అంటే జనవరి 8న రాత్రి స్పెషల్ ప్రీమియర్‌లను ఏర్పాటు చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. తెలంగాణలో ఉదయం 4గంటల షోకు కూడా అనుమతి ఇవ్వాలని కోరింది. స్పెషల్ ప్రీమియర్ టికెట్ ధరను సింగిల్ స్క్రీన్‌లో రూ.800 (పన్నులతో కలిపి).. మల్టీప్లెక్స్‌లలో రూ.1000 (పన్నులతో కలిపి) పెంచుకునేలా అనుమతి ఇవ్వాలని కోరింది. జనవరి 9 నుంచి 11 వరకూ సింగిల్ స్క్రీన్‌లో రూ.105 (పన్నులతో కలిపి).. 12 నుంచి 18వ తేదీ వరకూ రూ.62 (పన్నులతో కలిపి).. మల్టీప్లెక్స్‌లో వరుస తేదీల్లో రూ.132, రూ.89 పెంచుకునేలా అనుమతి ఇవ్వాలని కోరింది. కోర్టు ఇచ్చే ఆదేశాలననుసరించి చిత్ర బృందాలు టికెట్ ధరల విషయంలో ముందుకు వెళ్లనున్నాయి.

## మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటుదాం

**సంగారెడ్డి:** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాల్టీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పార్టీ కేడర్‌కు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సంగారెడ్డిలో స్థానిక, సదాశివపేట మున్సిపల్ ఎన్నికల సమావేశాన్ని జగ్గారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ.. తనను మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి పిలవద్దని కేడర్‌కు స్పష్టం చేశారు. భవిష్యత్ ఎమ్మెల్యే అభ్యర్థి నిర్మలా జగ్గారెడ్డిని ఈ ఎన్నికల ప్రచారానికి పిలవాలని పార్టీ కేడర్‌కు ఆయన సూచించారు. ఈ ఎన్నికల్లో టికెట్ల కోసం తన వద్దకు ఎవరూ రావద్దన్నారు. తాను ప్రచారానికి రాకున్నా.. ఈ జగ్గారెడ్డిని సంగారెడ్డి పట్టణ ప్రజలు నమ్ముతారని విశ్వాసం వ్యక్తం చేశారు. మీ గెలుపు కోసం చేసే వాగ్దానాలన్నీ తానే తీరుస్తానంటూ కేడర్‌కు ఈ సందర్భంగా జగ్గారెడ్డి భరోసా ఇచ్చారు. తన జీవితంలో మొత్తం పోలీసులను ఎదిరించి రాజకీయం చేశానని గుర్తు చేశారు. పోలీసులను అడ్డు పెట్టుకుని తానెప్పుడు రాజకీయం చేయలేదని చెప్పారు.
అధికారంలో ఉన్నామని.. పోలీసులను అడ్డం పెట్టుకొని గెలవాలని చూడవద్దని పార్టీ నేతలకు ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు. ఈ ఎన్నికల్లో టికెట్ల కోసం గాంధీ భవన్‌కు వెళ్లి పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి ఇబ్బంది పెట్టొద్దన్నారు. ఎన్నికల ప్రచారంలో మీరు ఏం హామీలు ఇస్తారో.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి వాటిని నెరవేర్చే బాధ్యత తనదని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. ఈ ఎన్నికల బరిలో పార్టీ నిలబెట్టిన అభ్యర్థులను ఓడించాలని చూసే వారిపై వేటు ఖాయమని నేతలను జగ్గారెడ్డి హెచ్చరించారు.

# తెలుగు రాష్ట్రాలలో సొంత పార్టీలు పెట్టిన మహిళలు

**మిగిలిన వారికంటే కవితలో బలం.. ఆమె గళం..**

**మంచి వాగ్ధాటి ఆమె సొంతం**

**జాగృతి సంస్థనే కొత్త పార్టీగా**

**తెలుగు రాష్ట్రాల్లో సొంతంగా పార్టీ పెట్టిన నాలుగో ప్రముఖ మహిళ**



**హైద్రాబాద్:** గ్రామ దండోరా బ్యూరో :ఎమ్మెల్సీ కవిత కొత్త పార్టీ పెట్టబోతున్నారా? అంటే అవుననే సమాధానం చెప్పారు కవిత. సోమవారం నాడు శాసనమండలి నుంచి బయటకు వచ్చిన తరువాత గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడారు కవిత. తన నేతృత్వంలో నడుస్తున్న జాగృతి సంస్థనే కొత్త పార్టీగా అవతరించనుందని కవిత ప్రకటించారు. రాజకీయంగా అందరూ మద్దతు ఇవ్వండని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే పార్టీ విధివిధానాలను ప్రకటిస్తానన్నారు. ఇంటి పార్టీ నుంచి అవమాన భారంతో బయటకు వస్తున్నానని.. గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతామన్నారు. సమస్యలపై పోరాడుతామన్నారు. రాజకీయాల్లో మార్పు తెచ్చే వేదికగా జాగృతి అవతరిస్తుందన్నారు కవిత. ఇక తెలుగు రాష్ట్రాలలో మహిళలు సొంతంగా పార్టీలు స్థాపించిన చరిత్ర ఉంది.. ఇలాంటివారు అందరూ ప్రముఖ నేపథ్యం నుంచి వచ్చినవారే. అయితే ఎవరూ సొంతంగా స్పేస్ కాలేకపోయారు. తమ పార్టీలను విలీనం చేయడమో, లేక వేరే పార్టీలో చేరిపోవడమో చేశారు. ఇప్పుడు కల్వకుంట్ల కవిత వంతు వంతు వచ్చింది. తెలంగాణ జాగృతి... ఈ ప్రాంత కల్చర్ ను నిలిపేందుకు కవిత ఏర్పాటు చేసిన సంస్థ. మొన్నటివరకు ఇదే సంస్థ పేరు మీద కార్యక్రమాలు నిర్వహించారు కవిత. అప్పటికి బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ కాలేదు కాబట్టి ఆమె ఏం చేస్తారు? అనేది చర్చకు రాలేదు. ఇప్పుడు మాత్రం కవిత సొంతంగా పార్టీ పెడతానని ప్రకటించడం గమనార్హం. కవిత తెలుగు రాష్ట్రాల్లో సొంతంగా పార్టీ పెట్టిన నాలుగో ప్రముఖ మహిళ అవుతారు. గతంలో దివంగత మహా నటుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ వివాహం చేసుకున్న లక్ష్మీపార్వతి తెలుగు రాజకీయాల్లో ఒక దశలో చాలా కీలక వ్యక్తిగా ఉన్నారు. అయితే, అది కొంతకాలమే. చంద్రబాబు సారథ్యంలో 1995లో ఎన్టీఆర్ అంతటి నేతను పదవీచ్యుతుడిని చేయడానికి పరోక్షంగా లక్ష్మీపార్వతి పెత్తనమే కారణం అని చెబుతుంటారు. చంద్రబాబు టీడీపీనీ తన వశం చేసుకున్నాక.. లక్ష్మీపార్వతి ఎన్టీఆర్ తెలుగుదేశంను స్థాపించారు. 1996లో పాతపట్నం నియోజకవర్గం నుంచి ఆమె ఎమ్మెల్యేగానూ గెలుపొందారు. ఆ తర్వాత పార్టీ ప్రభావం తగ్గింది. లక్ష్మీ పార్వతి స్వయంగా 2014లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్టీఆర్ తెలుగుదేశంను 2016లో భారత ఎన్నికల సంఘంజాబితా నుంచి తొలగించింది. సినిమా రంగంలో లేడీ సూపర్ స్టార్ స్థాయికి ఎదిగిన విజయశాంతి 1996 నుంచే రాజకీయాల వైపు మొగ్గారు. 1998లో ఏడాది బీజేపీలో చేరారు. మధ్యలో అన్నాడీఎంకేకు మద్దతు ఇచ్చారు. 2005లో తల్లి తెలంగాణ అంటూ సొంతంగా పార్టీ స్థాపించారు. చివరకు 2009లో మెదక్ నుంచి ఎంపీగా టీ(బీ)ఆర్ఎస్ తరఫున గెలిచారు. తెలంగాణ వచ్చేనాటికి ఆ పార్టీకి ఉన్న ఇద్దరు ఎంపీల్లో ఒకరు విజయశాంతి అయితే మరొకరు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. కానీ, ఆమె 2014 నాటికి కాంగ్రెస్ లో చేరారు. ఆ తర్వాత కొంతకాలం బీజేపీలో కొనసాగారు. మళ్లీ 2023 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ లోకి వచ్చారు. గత ఏడాది ఎమ్మెల్సీ అయ్యారు. తన తల్లి తెలంగాణ పార్టీని బీఆర్ఎస్ లో విలీనం చేసినట్లు రికార్డుల్లో ఉంది. ఉమ్మడి ఏపీ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ సోదరి అయిన వైఎస్ షర్మిల 2021లో వైఎస్సార్ తెలంగాణ కాంగ్రెస్ అంటూ సొంత పార్టీని స్థాపించారు. ఆ సమయంలో అన్న జగన్ ఏపీకి సీఎంగా ఉన్నారు. ఆస్తుల కోసం ఆయనతో విభేదించి.. సొంత పార్టీని అదీ తెలంగాణలో నెలకొల్పారు షర్మిల. ఇది అప్పట్లో సంచలనంగా మారింది. దీనికితోడు నాటి తెలంగాణ సీఎం కేసీఆర్ ను తీవ్ర పదజాలంతో విమర్శిస్తూ షర్మిల రాజకీయంగా కలకలం రేపారు. 2023 ఎన్నికల్లో పాలేరు నుంచి పోటీ చేస్తానని కూడా షర్మిల ప్రకటించారు. కానీ, ఎన్నికల కు ముందు ఆమె అనూహ్యంగా తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేశారు. ఇప్పుడు ఆ పార్టీకి ఏపీ అధ్యక్షురాలిగా ఉన్నారు. తెలుగు రాష్ట్రాల్లో సొంత పార్టీ పెట్టిన నాలుగో ప్రముఖ మహిళ కవిత అవుతారు. లక్ష్మీపార్వతి.. ఎన్టీఆర్ మరణం తాలూకు సానుభూతితో కొంతకాలం రాజకీయాల్లో కొనసాగారు. విజయశాంతి సినీ గ్లామర్–తెలంగాణవాదంతో మనుగడ సాగించారు. వీరిద్దరూ ఎమ్మెల్యే, ఎంపీ–ఎమ్మెల్సీ అయ్యారు. షర్మిలకు తన తండ్రి ఎంతగానో ప్రేమించిన కాంగ్రెస్ పార్టీ పగ్గాలు దక్కాయి. వీరందరికీ ఎంతో కొంత రాజకీయ బలం అండగా వచ్చింది. వీరి స్థాయిలో కవితకు పార్టీ బలం అండగా లేదనే చెప్పాలి. కాకపోతే వారికంటే కవితలో ఉన్న బలం.. ఆమె గళం.. మంచి వాగ్ధాటి ఉన్న కవిత... విషయాన్ని పిన్ పాయింట్ గా చెప్పగలరు. మరి ఎంతవరకు ముందుకెళ్తారో చూడాలి.

## భారత ప్రజలమైన మేము...

1946 డిసెంబర్ 9న సరిగ్గా 11 గంటలకు న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ హాల్‌లో రాజ్యాంగ సభ మొదటి సారిగా సమావేశమైంది. ఈ సభలోని సుమారు 300 మంది సభ్యులు నేరుగా ప్రజల ద్వారా ఎన్నికైనవారు కాదు. బ్రిటిష్ ఇండియా ప్రావిన్సుల్లోని శాసనసభలు ఎంపిక చేసినవారు. మూడేళ్లలో 5,546 పేజీల చర్చలు జరిపి, ఈ రాజ్యాంగ సభ 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదించింది. 1950 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చింది. అప్పుడు ఈ మొత్తానికైన ఖర్చు రూ.47 లక్షలు. అయితే ఈ రాజ్యాంగ సభకు వెలుపల రాజ్యాంగం కోసం పడిన భిన్న ఆరాటాలను వివరించే పుస్తకం: 'అసెంబ్లింగ్ ఇండియాస్ కాన్‌స్టి ట్యూషన్'. ఈ 400 పేజీల పుస్తకం ఒకప్పుడు దేశాన్ని పట్టిన రాజ్యాంగ జ్వరాన్ని కళ్లకు కడుతుంది.రాజ్యాంగ ప్రక్రియలో కేవలం మేధావులు మాత్రమే పాల్గొనలేదనీ, ఇంకా 'ఇండియా'గా రూపు దిద్దుకోని భారత నేల నలుమూలలలో ఉన్న సకల జనాలు చురుగ్గా పాలుపంచుకున్నారనీ చెబుతారు రచయితలు. స్వతంత్ర భారతంలో తామెలాంటి పాలన కోరుకుంటున్నారో బలూచిస్తాన్ నుంచి బెజ వాడ వరకు వేలాది మంది పౌరులుగా, సంఘాలుగా, పార్టీలుగా, అధికార ప్రతినిధులుగా, ట్రేడ్ యూనియ న్లుగా తమ సంతకాలతో, వేలిముద్రలతో పంపిన అభ్యర్థనలను, అభిప్రాయాలను తవ్వితీసి, ఈ ఉత్సాహపూరిత ప్రజా కోణాన్ని అంతే ఆసక్తికరంగా వెల్లడించారు రచయితలు. ఉదాహరణకు గౌహతి నుంచి నలిన్‌కాంత బర్కాకటి పంపిన చిన్న కాగితం రాజ్యాంగ సభ సచివాలయానికి 1947 జనవరి 8న అందింది. 'రాజ్యాంగ విషయాల్లో తన అజ్ఞానాన్ని మన్నించమంటూనే', ఏ శాసనసభ్యుడినైనా ఎప్పు డైనా 'రీకాల్' చేసే హక్కు ఓటర్లకు ఉండాలని అతడు రాశాడు. అంటరానితనాన్ని నిర్మూలించకుండా సమైక్య భారతదేశం సాధ్యం కాదని వజీరిస్తాన్‌లోని బన్నూ నుంచి ప్రజా ప్రతినిధి కోటూ రామ్ కోరాడు. మహిళలకు సమాన హక్కులు; మరణశిక్ష రద్దు; జైనులు, బేనె ఇజ్రాయెలీ యూదులతో సహా మైనా రిటీల హక్కులు; నగర బాలురతో సమానంగా గ్రామీణ పిల్లల హక్కుల లాంటివే కాదు, 'చెవిటి మూగ' వారికి ప్రత్యేక గ్యారంటీలు, విశ్వకర్మలకు ఫీజుల్లో రాయితీలు కోరుతూ కూడా లేఖలు అందాయి. విచిత్రంగా తమ లేఖల ద్వారా రాజ్యాంగ సభకు జనమే చట్టబద్ధత కల్పించారంటారు రచయితలు.

**'ఆచరణాత్మక' కారణాల వల్ల, తొలుత**

రాజ్యాంగ చర్చలను రహస్యంగానే ఉంచదలిచిన పెద్దలు ఈ ప్రజాబాహుళ్యపు ఒత్తిడితో రాజ్యాంగం ఏ రూపం తీసుకుంటుందో బహిరంగపరచదలిచారు. 1948 ఫిబ్రవరి 26న ప్రచురించిన డ్రాఫ్ట్ కాన్‌స్టిట్యూ షన్(ఆంగ్లం) బెస్ట్‌సెల్లర్‌గా నిలిచింది. వెల: ఒక్క రూపాయి. ఇది చెల్లించలేనివాళ్లు అణాతో 24 పేజీల సారాంశం చదువుకోవచ్చు. వారంలోనే దీన్ని దాదాపు అన్ని భారతీయ భాషల్లోకి అనువదించడానికి అనుమ తులు కోరుతూ లేఖలు రాసాగాయి._.జి.చౌబాల్ అనే మరాఠీ జర్నలిస్టు 'మాతృదేశ సేవ' కోసం తన సేవలను వాడుకోవాలని రాశాడు. ఈ పుస్తకం వెల్లడించే మరో కోణం, 'ఇండియన్ యూనియన్'కు సమాంతరంగా, అప్పటికి స్వతంత్రంగానే ఉండదలిచిన సంస్థానాల్లో కూడా రాజ్యాంగ రచన ఎలా జరిగిందో వివరించడం. సంస్థానాలకు రాజ్యాంగ సభ 93 ప్రాతినిధ్య స్థానాలను ఇచ్చిన ప్పటికీ, తమను తాము ప్రజాస్వామీకరించుకోవడంలో భాగంగా అవి ఈ ప్రక్రియ చేపట్టాయి. రాంపూర్ పాలకుడు తన ప్రజలకు భావస్వేచ్ఛతో సహా తొమ్మిది ప్రాథమిక హక్కులను ప్రసాదించాడు. రత్‌లామ్ రాజ్యాంగం ఉచిత ప్రాథమిక విద్యను రాజ్య బాధ్యతగా పేర్కొంది. 'మేము ఇప్పటివరకు తమ సొంత రాజ్యాంగాన్ని రూపొందించుకున్న 75 సంస్థా నాలను గుర్తించాం' అంటారు రచయితలు.ఇంకా న్యాయమూర్తులు ఎలా భాగమయ్యారు; ట్రూమన్‌తో సహా అమెరికా, యూకే, ఐర్లాండ్, _నడా నాయకులు, న్యాయనిపుణుల ఫీడ్‌బ్యాక్ తీసు కోవడం ద్వారా రాజ్యాంగపు ఫస్ట్ డ్రాఫ్ట్ రూపొందించిన సర్ బి.ఎన్.రావు ఇండియా రాజ్యాంగాన్ని 'ప్రపంచ వేదిక'కు ఎలా పరిచయం చేశారు; ఈశాన్య రాష్ట్రాల్లోని గిరిజనులు తమ హక్కుల కోసం ఎలా నిల బడ్డారు లాంటి అంశాలను విపులంగా చర్చించిన ఈ పుస్తకం రాజ్యాంగపు బహుముఖ పార్శ్వా?వలను తెలుసు కోగోరేవారికి ఆసక్తి కలిగిస్తుంది. కోట్ల మంది ఆశలను ఒక దగ్గర గుదిగుచ్చడం ఎంత దుర్భరమో, అబ్బు రమో కూడా అర్థమవుతుంది. తర్వాతి రాజ్యాంగ సవరణలు ఈ ప్రజా చైతన్యపు కొనసాగింపే!

## అటెన్షన్.. ప్రతీ ఒక్కరి ఖాతాలో రూ.46 వేలు జమ!

ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రభుత్వాలు రకరకాల పథకాలను ఆచరణలోకి తెస్తున్నాయి. పోను.. పోను.. వాటి కోసం ప్రజా ధనం కూడా విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. ఉచితాల విషయంలో విమర్శలు వినవస్తున్నా.. కోర్టులు అక్షంతలు వేస్తున్నా వెనక్కి మాత్రం తగ్గడం లేదు. రూ.46 వేలు జమ చేయడం కూడా ఇలాంటిదేమో అని అనుకునేవాళ్లు లేకపోలేదు.ప్రస్తుతం మన దేశంలో అన్ని వయసులవారికి.. రకరకాల పథకాలు అమలు అవుతున్నాయి. వాటిల్లో చాలామందికి చాలావాటిపై అవగాహన ఉండడం లేదు. దీంతో.. ప్రభుత్వాలే అందుకు సంబంధించిన సమాచారాన్ని వివిధ మాధ్యమాల ద్వారా తెలియజేసే ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే ఇదే అదనుగా స్కామర్లు కూడా రెచ్చిపోతున్నారు.

**జగతి పబ్లికేషన్స్ లిమిటెడ్**

సోషల్ మీడియా యూజర్లను, అమాయక ప్రజలను మోసం చేయడానికి ఎప్పటికప్పుడు కొత్త పన్నాగాలు పన్నుతున్నారు. ఇదే తరహా మోసం తాజాగా ఒకటి వెలుగులోకి వచ్చింది. ఇది ఎంతవరకు నిజం అనే విషయాన్ని.. పీఐబీ ఫ్యాక్ట్ చెక్ వివరించింది. దీనికి సంబంధించిన ట్వీట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.లింక్‌పై క్లిక్ చేసి.. మీ వ్యక్తిగత సమాచారాన్ని పంచుకుంటే ప్రభుత్వం నుంచి రూ. 46,715 పొందండి. ఇది నమ్మశక్యంగా అనిపించడం లేదా? మరోసారి ఆలోచించండి! అనే ఒక మెసేజ్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆర్థిక మంత్రిత్వ శాఖ పేదలకు రూ. 46,715 సహాయం అందిస్తోందట అని కొందరు మోసగాళ్లు ప్రచారం చేస్తున్నారు.దీనిపై పీఐబీ ఫ్యాక్ట్ చెక్ స్పందిస్తూ.. ఆర్థిక మంత్రిత్వ శాఖ పేదలకు రూ. 46,715 సహాయం అందిస్తుందని వైరల్ అవుతున్న వార్తను ఎవరూ నమ్మకండి. ఇదంతా అబద్ధం అని స్పష్టం చేసింది. ఇలాంటి ఒక పథకం గురించి ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించలేదని వెల్లడించింది.

**ఫేక్ సందేశాల పట్ల జాగ్రత్త**

సోషల్ మీడియాలో ఫేక్ సందేశాలు కోకొల్లలుగా వెలుగులోకి వస్తున్నాయి. సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేయాలనే ఉద్దేశంతో.. తప్పుడు లింక్స్ పంపించి.. డబ్బు దోచేస్తున్నారు. కాబట్టి తెలియని లింక్స్ లేదా తెలియని మొబైల్ నంబర్ల నుంచి వచ్చే ఎలాంటి లింక్స్ మీద క్లిక్ చేయ కూడదు. మోసాల భారి నుంచి బయటపడటానికి ఉత్తమ మార్గం అపరిచిత లింకులపై క్లిక్ చేయకుండా ఉండటమే.

# 5 ఫెయిల్, రూ.12తో మొదలై రూ.12,000 కోట్ల సామ్రాజ్యం

సూరత్‌కు చెందిన ఈ వజ్రాల వ్యాపారి సావ్జీ డోలకియా అనగానే అందరికీ గుర్తు వచ్చేది ప్రతి ఏటా తమ ఉద్యోగులకు ఖరీదైన బహుమతులు ఇవ్వడం. ఖరీదైన కార్లు ఇళ్లు, కార్లు, వజ్రాలు, ఆభరణాలు ఇలా ఎంతో విలువైన బహుమతులతో కేవం తన ఉద్యోగులను మాత్రమే కాదుయావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తుతారు. కానీ ఇలా ఖరీదైన బహుమతులు వచ్చేంత స్థాయికి రావడానికి వెనుక ఉన్న కృషిని గురించి ఎపుడైనా ఆలోచించారా? ఒక సామాన్య కుటుంబంలో పుట్టి, అంచెలంచెలుగా ఎదిగి డైమండ్ సామ్రాజ్యాన్ని నిర్మించి, సావ్జీభాయ్‌గా పేరు గడించిన హరి కృష్ణ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు ఛైర్మన్, సావ్జీ ధోలాకియా స్ఫస్ గురించి తెలుసుకుందాం.గుజరాత్‌లోని దుధాల గ్రామానికి చెందిన ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టారు సావ్జీ ధోలాకియా. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా 5వ తరగతిలోనే చదువు ఆపేశారు. అంతేకాదు 1977లో కేవలం 13 ఏళ్ల వయసులోనే , జేబులో 12 రూపాయలు 50 పైసలు (బస్సు టిక్కెట్‌కు సరిపోయే) సూరత్ నగరానికి పయనమయ్యాడు. అప్పటికి ఆయన మనసులో ఉన్నది కుటుంబానికి పోషించుకోవడం మాత్రమే.

**జగతి పబ్లికేషన్స్ లిమిటెడ్**

ఆలా సూరత్ నగరంలో తొలి ఉద్యోగం వజ్రాల కర్మాగారంలో. నెలకు రూ.179 రూపాయల జీతం. ఈ కొద్ది పాటి జీతంలోంచే ఆయన ప్రతి నెలా రూ. 39 పొదుపు చేసేవాడు. 1984లో తనకంటూ ఏదైనా సాధించాలనే కల మొదలైంది. ఈ కల సాకారానికి పట్టుదల ఓర్పుతోడైంది. తన సోదరులతో కలిసి, అతను 'హరి కృష్ణ ఎక్స్‌పోర్టర్ణ అనే చిన్న వజ్రాల వ్యాపారాన్ని ప్రారంభించాడు. వజ్రాల వ్యాపారం రిస్క్ తో కూడుకున్నది, పైగా పోటీ. దీంతో మొదట్లో వ్యాపారం చాలా కష్టమయ్యేది. కానీ ప్రజలపై సావ్జీభాయ్‌కి నమ్మకం వమ్ముకాలేదు. దీనికి తోడు ఉద్యోగులకు కార్మికుల్లాగా కుండా, తన ఇంట్లో మనుషుల్లాగా చూసుకునవాడు. అటు ఉద్యోగుల మనసుల్లోనూ, ఇటు వ్యాపారంలోనే అందనంత ఎత్తుకు ఎదిగాడు.ఉద్యోగులకు బోనస్‌లు ఇవ్వడం మాత్రమే కాదు, ఖరీదైన దీపావళి కానుకలిస్తూ సావ్జీభాయ్ ధోలాకియా వార్తల్లో నిలిచారు. ఆయన నమ్మింది ఒకటే. తన ఉద్యోగులకు బావుంటే.. కంపెనీ బావుంటుంది..వారి అభివృద్ధే తన వ్యాపారం అభివృద్ధి అని. అదే నమ్మకం నేటికీ కొనసాగుతోంది. 2025లో కూడా 3 కోట్ల రూపాయలకు పైగా విలువైన మూడు బ్రాండ్ న్యూ మెర్సిడెస్-బెంజ్ +ూా ూఖఎలను కానుకగా ఇచ్చాడు. పాతికేళ్ళనుంచి తన కంపెనీలో సేవలందిస్తున్న నమ్మకమైన జట్టు సభ్యులు, ముగ్గురు సీనియర్ ఉద్యోగులకు బహుమతిగా ఇచ్చాడు. సావ్జీభాయి దృష్టిలో ఇటువంటి బహుమతులు అంటూ దుబారా కాదు, జీవితాంతం కలిసి చేసిన కృషికి, విజయానికి హృదయపూర్వక 'ధన్యవాదాలు'అంటారాయన.ఈ ప్రత్యేకమైన లక్షణమే ఒక చిన్న వర్క్‌షాప్‌గా మొదలైన ఆయన కంపెనీ ప్రపంచ వజ్రాల శక్తి కేంద్రంగా నిలిపింది. ఆభరణాల బ్రాండ్ 'కిస్నా' వ్యాపారం ఇప్పుడు రూ. 12,000 కోట్లకు పైమాటే.. 2022లో, భారత ప్రభుత్వం సావ్జీభాయ్ ధోలాకియాను గుజరాత్‌లో సామాజిక సేవలో ఆయన చేసిన విశిష్ట సేవకు గాను దేశంలోని అత్యున్నత పౌర అవార్డులలో ఒకటైన పద్మశ్రీతో సత్కరించింది. బిలియనీర్ ,పద్మశ్రీ అవార్డు గ్రహీత సావ్జీభాయ్ ఇప్పటికీ చాలా సాదా సీదాగా ఉండే వ్యక్తి. ధోలాకియా 1996లో హరి కృష్ణ ఛారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించారు. దాన్నే ధోలాకియా ఫౌండేషన్ అని పిలుస్తారు. దీని ద్వారా అనేక కార్యక్రమాలతోపాటు, చెట్లను నాటడం, నీటిని ఆదా చేయడం , భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని రక్షంచడం కోసం కోట్లు ఖర్చు చేయడం విశేషం. మొక్కవోని పట్టుదల, అచంలమైన విశ్వాసంతో సాగిన ఆయన జీవితం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి ప్రేరణగా నిలుస్తున్నారు.

## పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ లో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ షాబీర్ అలీ







**నిజాంపేట్ గ్రామ దండోరా ప్రతినిధి జనవరి 6 :** నిజాంపేట్ సర్కిల్ఉ58 పరిధిలోని రాజధాని స్కూల్ రోడ్, వార్డు నెం. 275 (బండారి లేఔట్) మరియు వార్డు నెం. 273 (నిజాంపేట్) ప్రాంతాల్లో గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహిస్తున్న పారిశుధ్య స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా, విస్తృత పారిశుధ్య కార్యక్రమం చేపట్టబడింది. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ షాబీర్ అలీ పాల్గొన్నారు.స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్లు , విద్యుత్ స్తంభాల సమీపంలో పేరుకుపోయిన చెత్త వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించి, చెత్త వ్యర్థాల పాయింట్లను శుభ్రపరిచారు. పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను మెరుగు పరచడంతో ప్రజారోగ్య పరిరక్షణకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ చెత్తవేయకుండా మీ ఇల్ల దగ్గరకు వచ్చినటువంటి టాక్టర్ల లోనే వేసి మీ కాలనీలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రోడ్లపై చెత్త వేస్తే ఫైన్ వేస్తామని ప్రజలకు సూచించారు.ఈ పారిశుధ్య కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్, డి.ఈ (ఎస్.డబ్ల్యూ.ఎం), ఏ.ఈ (ఎస్.డబ్ల్యూ.ఎం), ఇంచార్జ్ ఏ.ఎం.సి.లు, మునిసిపల్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొని సహకరించారు.

## విల్సన్‌కు 'టాటా'.. ఎయిరిండియా సీఈఓ కోసం కసరత్తు!

ఎయిరిండియాకు కొత్త సీఈవోను నియమించే దిశగా టాటా గ్రూప్ అన్వేషణ ప్రారంభించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ క్యాంప్‌బెల్ విల్సన్ పదవీ కాలం 2027 జూన్‌తో ముగియనున్న నేపథ్యంలో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు సమాచారం. అలాగే తక్కువ ఖర్చుతో సేవలు అందించే అనుబంధ సంస్థ 'ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్' కొత్త ఎండీ నియామకంపైనా టాటా గ్రూప్ దృష్టి సారించినట్లు తెలిసింది."2027 తర్వాత ఒప్పందాన్ని పొడిగించాలనే ఉద్దేశం విల్సన్‌కూ, టాటా గ్రూప్‌కూ లేదు. ఆయన స్థానంలో మరో వ్యక్తిని సీఈవోగా చేయాలని టాటాసన్స్ భావిస్తోంది. అందులో భాగంగా ఎయిరిండియాకు బాధ్యతలు చేపట్టగలిగే సామర్థ్యం కలిగిన అభ్యర్థులతో చర్చలు జరుపుతున్నారు" అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా బోయింగ్ 787ఉ8 ప్రమాదానికి సంబంధించిన తుది నివేదిక జూన్ నాటికి వెలువడే అవకాశం ఉందని సమాచారం. కాగా, టాటా హౌస్‌లో సోమవారం జరిగిన ఓ అధికారిక సమావేశానికి క్యాంప్‌బెల్ విల్సన్ హాజరు కావడం గమనార్హం.

## పెరిగిన పీవీసీ ఆధార్ కార్డు ఛార్జీలు

ఆధార్ కార్డు దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయడానికి.. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథరిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ ఉంది. ఇందులో భాగంగానే.. పేపర్‌లెస్ ఆధార్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కొత్తగా ఆధార్ యాప్ కూడా ప్రవేశపెట్టింది. ఇపుడు తాజాగా.. ఆధార్ ూఎజ కార్డు కోసం సర్వీస్ ఛార్జీని రూ.50 నుంచి రూ.75కి పెంచింది.పెరిగిన ూఎజ కార్డు సర్వీస్ ఛార్జీలలో.. ట్యాక్స్, డెలివరీ ఛార్జీలు ఉన్నాయి. 2020లో ఈ సేవ ప్రవేశపెట్టిన ధర పెంచడం ఇదే మొదటిసారి. 2026 జనవరి నుంచి ఆధార్ ూఎజ పొందాలనుకుంటే వినియోగదారులు కొత్త ఛార్జీలు చెల్లించాల్సిందే. ఎవాఖుఙష్ట్రఖుతీ వెబ్‌సైట్ లేదా పాఖుఙష్ట్రఖుతీ మొబైల్ యాప్ అప్లై చేసుకొనే వినియోగదారులకు కూడా ఇవే ఛార్జీలు వర్తిస్తాయి. సంవత్సరం జనవరి 1 నుండి కొత్త ధర అమలులోకి వచ్చిందని తెలిపింది.

**ధర పెరుగుదలకు కారణం**

పీవీసీ ఆధార్ కార్డు ధరల పెరుగుదలకు కారణం.. నిర్వహణ ఖర్చులు పెరగడం అని యూనిక్ ఐడెంటిఫికేషన్ అథరిటీ ఆఫ్ ఇండియా వెల్లడించింది. కొన్నేళ్లుగా.. ఆధార్ ూఎజ కార్డ్ ఉత్పత్తి, పంపిణీకి సంబంధించిన మెటీరియల్స్, ప్రింటింగ్, సురక్షత డెలివరీ, లాజిస్టిక్స్ ఖర్చు పెరిగింది. దీనివల్ల ఛార్జీలు పెంచినట్లు సంస్థ స్పష్టం చేసింది.

## తెలంగాణలో జర్నలిస్టుల జోలికి వస్తే ఊరుకోంబిసుందర్ కల్లూరి

**సంఘాలు కాదు జర్నలిస్టుల సంక్షమమే మాకు ముఖ్యం.**

**జర్నలిస్టులను వేరు చేసి చూడడం తగదు.**

**చిన్న పత్రికలకు, డిజిటల్ మీడియాకు అక్రిడేషన్ ఇవ్వాలి.**

**జీవో 252 ని పునఃసమీక్షంచాలి.**



**హైదరాబాద్, గ్రామ దండోరా ప్రతినిధి** :తెలంగాణలోని ప్రతీ జర్నలిస్ట్ కి న్యాయం జరగాలని రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులు, చిన్న పత్రికలు, డిజిటల్ మీడియా అంటూ వేరు చేయడం తగదని, జీవో 252 ని పునఃసమీక్షంచాలని, అర్హులైన ప్రతీ జర్నలిస్ట్ కి అక్రిడేషన్ కార్డు ఇవ్వాలని, ప్రభుత్వం నుండి రావాల్సిన సంక్షమ పథకాలన్నీ జర్నలిస్టులకు అందాలని తెలంగాణ జర్నలిస్ట్ సంక్షమ సంఘం ఉపాధ్యక్షుడు సుందర్ కల్లూరి డిమాండ్ చేసారు. తెలంగాణ వ్యాప్తంగా విధి నిర్వహణలో ఉన్నటువంటి జర్నలిస్ట్ ల జోలికి వస్తే మాత్రం ఎంతటి వారైనా సరే ఉపేక్షంచే ప్రసక్తే లేదంటూ హెచ్చరించారు. మీకు జరిగిన ఇబ్బంది మా దృష్టికి తీసుకొస్తే, తెలంగాణ జర్నలిస్టు సంక్షమ సంఘం మీ దగ్గరికి వచ్చి మీకు కొండంత అండగా ఉంటుందని జర్నలిస్టులందరికీ భరోసా ఇచ్చారు.ఈ నేపథ్యంలో మంగళవారం తెలంగాణ జర్నలిస్ట్ సంక్షమ సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు ఆనం చిన్ని వెంకటేశ్వర్ రావు అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఉపాధ్యక్షుడు సుందర్ కల్లూరి, తెలంగాణ జర్నలిస్టు సంక్షమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కీర్తీ సంతోష్ రాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వేణుగోపాల్, గ్రేటర్ హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి సాయి గౌడ్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# అగ్నిజ్వాల... శబ్దఘోష!



కోనసీమ గడ్డపై మళ్లీ మంటలు ఎగసిపడుతున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలో సోమవారం ఉదయం మోరిఉ5వ నంబర్ బావి వద్ద బీభత్సమైన శబ్దంతో బ్లోఅవుట్ ఉబికి, గ్యాస్ ఎగదన్నుతూ భారీ ఎత్తున మంటలు వ్యాపించటంతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనల్లో పడ్డారు. మంగళవారం మధ్యాహ్నానికి బ్లోఅవుట్ తీవ్రత తగ్గినా మరికొన్ని రోజులు ఇది కొనసాగుతుందని ఓఎన్‌జీసీ అధికారులు చెబుతున్న మాట. సహజ వాయువు వెలికితీత కోసం ఇనుప గొట్టాలతో డ్రిల్లింగ్ చేస్తున్నప్పుడు రాతిపొర తగిలితే ఆ గొట్టం ద్వారా బాంబింగ్ జరపడం అలవాటు. ఆ క్రమంలోనే ఒక్కసారిగా సహజ వాయువు పెల్లుబికి ప్రమాదానికి దారితీస్తుంది. ఇది మొదటిసారేమీ కాదు. చిన్నవో, పెద్దవో ఇలాంటి ఉదంతాలు అడపా దడపా చోటుచేసుకుంటూనే ఉన్నాయి. 1993లో కొమరాడలో తొలిసారి ప్రమాదం జరగ్గా 1995 జనవరిలో పాశర్లపూడి 19ఏ బావిలో డ్రిల్లింగ్ సమయంలో బ్లోఅవుట్ సంభవించి 65 రోజులపాటు కోనసీమను హడలెత్తించింది. 2014లో మామిడికుదురు మండలం నగరం గ్రామంలోని గెయిల్ కంపెనీ పైపులైన్ పగిలి గ్యాస్ విడుదలై 22 మంది ప్రాణాలు కోల్పోగా, 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. చిన్నవే కావొచ్చుగానీ... అటుతర్వాత కూడా ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అదృష్టవశాత్తూ ప్రస్తుత ఉదంతంతో సహా దాదాపు అన్నీ జనం అప్రమత్తంగా ఉన్న వేళ సంభవించినవే. కానీ ఆదమరిచి నిద్రిస్తున్నవేళ జరిగితే జనం ప్రాణాలు ఏం కావాలి? మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో డ్రిల్లింగ్ చేస్తుండగా ఒక్క సారిగా సహజ వాయువు ఎగదన్నిందనీ, ఆకాశాన్నంటేలా మంటలు వ్యాపించాయనీ మీడియా కథనం. క్షణాల్లో ఆ ప్రాంతంలో గ్యాస్ అలుముకోవటంతో చుట్టూ ఉన్న గ్రామాల్లోనివారు ఇళ్లకు తాళాలేసి ప్రాణభయంతో పిల్లాపాపల్ని తీసుకుని పరుగులు పెట్టారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో వెంటనే పోలీసులొచ్చినా ఓఎన్‌జీసీ సిబ్బంది మాత్రం గంటన్నర తర్వాతగానీ రాలేదని జనం చెబుతున్నారు. తరచు సమస్యలెదురవుతున్నా, ప్రమాదం జరిగే ప్రాంతాలు జనావాసాలకు దగ్గరగా ఉంటున్నా ఏటా వేలకోట్ల రూపాయల విలువైన చమురు, సహజ వాయువులను తోడేస్తున్న సంస్థలు భద్రత విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. సమస్య ఉత్పన్నమైనప్పుడు తక్షణం తీసుకోవాల్సిన వరస చర్యలేమిటో సిబ్బందికి కనీస అవగాహన ఉందా? అక్కడి నుంచి మాయంకావటం తప్ప ఇంకేమీ తెలియదా? వెంటనే ఎవరెవరికి సమాచారం అందించాలో, నిపుణులైనవారు అనుసరించాల్సిన విధివిధానా లేమిటో రూపొందాయా? అవసరమైన ఉపకరణాలేమైనా అక్కడ అందుబాటులో ఉన్నాయా? జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్)ను ఈ కార్యకలాపాలు జరిగే ప్రాంతాలకు సమీపంగా ఉంచారా స్థానికులకు ఎప్పటికప్పుడు తగిన సమాచారం ఇచ్చే వ్యవస్థలుండాలి. గోప్యత పాటిస్తే అనవసర వదంతులు వ్యాపిస్తాయి. ఒకప్పుడు ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలోనే కార్యకలాపాలన్నీ సాగేవి. ఇప్పుడు ప్రైవేటు సంస్థల ప్రమేయం పెరిగింది. చేసేది ఎవరైనా నిర్లక్ష్యం సహించరానిది.కోనసీమ గర్భంలో అపురూపమైన సహజ వనరులు నిక్షిప్తమై ఉన్నాయని తెలిశాక స్థానికులు సంతోషించారు. ఉద్యోగావకాశాలతోపాటు, అభివృద్ధి పనులు కూడా చకచకా మొదలవుతాయని ఆశించారు. కానీ జరిగిందంతా వేరు. అంతంతమాత్రంగా ఉన్న రహదారులు భారీ వాహనాల రాకతో దెబ్బతిన్నాయి. సున్నితమైన పర్యావరణం కొంచెం కొంచెంగా దెబ్బతింటూ కొబ్బరి, వరి దిగుబడి తగ్గిపోయిందని రైతులు చెబుతున్న మాట. చమురు, గ్యాస్ వెలికితీశాక ఆ ఖాళీలోకి సముద్ర జలాల ఊట చేరి బావుల్లో నీరు ఉప్పగా మారిందంటున్నారు. జల, వాయు కాలుష్యాలు ప్రజారోగ్యంపై కలగజేస్తున్న ప్రభావం ఏమిటో ప్రభుత్వాలు ఆరా తీసినట్టు లేదు. తెలంగాణలోని సింగరేణిలో తవ్వే బొగ్గుపై వచ్చే ఆదాయంలో 50 శాతం వాటా రాష్ట్ర ప్రభుత్వానికిస్తుండగా చమురు, సహజవాయువుల నుంచి లభించే ఆదాయంలో ఆంధ్రప్రదేశ్‌కి ఇస్తున్నదెంత కోనసీమకు దక్కుతున్నదేమిటి ఈ బ్లోఅవుట్ చల్లారిన తర్వాతైనా ప్రభుత్వమూ, ప్రజాప్రతినిధులూ దీనిపై దృష్టి పెట్టాలి.

# రాయలసీమకు అసలు ద్రోహి చంద్రబాబే

**ఆల్మట్టిని ఆపకుండా తాత్సారం చేసారు**

**పోతిరెడ్డిపాడును అడ్డుకున్న ఘనతా ఆయనదే**

**సీమకు మరణశాసనం రాసిందే చయంద్రబాబు**

**క్యూసెక్కులు, టీఎంసీలకు తేడా సైతం మంత్రి నిమ్మల**

**వైకాపా నేత గడికోట శ్రీకాంత్ రెడ్డి విమర్శలు**



**అమరావతి**: రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మరోసారి జల వివాదంపై ఆరోపణలు, విమర్శల పర్వం కొనసాగుతోంది.. గత ప్రభుత్వ అసమర్ధత వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ప్రస్తుత ప్రభుత్వాలు చెబుతుండగా వైసీపీ సీనియర్ నేత ఈ వ్యవహారంపై హాట్ కామెంట్లు చేశారు. తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుచేసిన మోసం బహిర్గతం అయ్యిందని వైకాపా నేత గడికోట శ్రీకాంత్ రెడ్డి దుయ్యబట్టారు.. ప్రాజెక్టుల విషయంలో క్యూసెక్కులు, టీఎంసీలకు మధ్య కనీస తేడా సైతం తెలియని వ్యక్తి మంత్రి నిమ్మల రామనాయుడని గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. అలాంటి వ్యక్తికి రాయలసీమ ఎత్తిపోతల పథకం విలువ ఏలా తెలుస్తుందని ప్రశ్నించారు. మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ లిఫ్టుతో ఎన్ని జీవితాలు ముడిపడి ఉన్నాయన్న విషయం మంత్రికి ఏం తెలుసని ప్రశ్నించారు. రాయలసీమను ఎడారిగా మార్చబోతే దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ తెచ్చి ఊపిరి పోశారన్నారు. అప్పట్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు పోతిరెడ్డిపాడును అడ్డుకునేందుకు ప్రయత్నించారని చంద్రబాబు ప్రభుత్వానికి రాయలసీమ మీద ఎందుకంత కోపమో తెలియదన్నారు. చంద్రబాబే రాయలసీమకు మరణ శాసనం రాశారని తెలిపారు. 1995లో ఆల్మట్టి డ్యాం నిర్మాణాన్ని ఆపలేదు. అప్పటినుంచే చంద్రబాబు రాయలసీమ విషయంలో కుట్రలు జరుపుతున్నారని తెలిపారు. ఇప్పుడు రాయలసీమ లిఫ్టుపై చంద్రబాబు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అక్కడి ప్రజలు సహించరన్నారు. ఆల్మట్టి నుండి జూరాలకు నీరు వచ్చేసరికే వాటిని పక్క రాష్ట్రాలు దోచేస్తున్నాయి. శ్రీశైలంలో 800 అడుగులకు నీరు రాకముందే తెలంగాణకు జలాలు వెళుతున్నాయి. ఇక వీటన్నిటిని దాటి ఇక రాయలసీమకు నీరు ఏప్పుడు వస్తుందని ఎమ్మెల్యే ప్రశ్నించారు. శ్రీశైలం ప్రాజెక్టులో కనీసం డేడ్ స్టోరేజీ వాటర్ కూడా ఉండడం లేదు. చంద్రబాబు నిర్లక్ష్యం వలనే రాష్ట్రంలోని ప్రాజెక్టుల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. బ్రహ్మం సాగర్, గండికోట ప్రాజెక్టులను మాజీ సీఎం జగన్ పూర్తి చేశారని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాయలసీమకు చేసిందేంటని ప్రశ్నించారు. మంత్రి నిమ్మలతో చంద్రబాబు మాట్లాడించిన మాటలను వెంటనే వెనక్కు తీసుకోవాలని రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని సంవత్సరంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాయలసీమ ప్రజల ఆవేదనను ముఖ్యమంత్రి చంద్రబాబు అర్థం చేసుకోవాలని తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా చంద్రబాబుపై ఒత్తిడి చేసి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పై పనిచేసే కార్యక్రమాల్ని ఆపించించానని తెలిపారని గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు.. గతంలో చంద్రబాబు ఎన్నోసార్లు విభిన్న కారణాలతో పనులను నిలిపివేశారని ఒకసారి ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్ లేకపోవడంతో ఆపామని, మరలా ఇతర కారణాలు చెప్పారని విమర్శించారు. అలమట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపును కూడా తిరస్కరించడం గురించి, అలాగే ప్రస్తుతం కర్ణాటక ప్రభుత్వం స్టోరేజ్ స్థాయిని రెండింతలు పెంచుతున్న విషయం పై ఏపీ ప్రభుత్వం స్పందించడానికి సిద్ధంగా లేకపోవడం పై కూడా ప్రశ్నించారు . గత 20 సంవత్సరాల్లో కేవలం నాలుగు సంవత్సరాలకే మాత్రమే నీటి విడుదలను ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. అనేక సంవత్సరాలుగా నీటి సమస్యతో కష్టపడుతున్న రాయలసీమ ప్రజలకు నీటి ఇబ్బంది ఇంకా కొనసాగుతోందని అతడు అభిప్రాయపడ్డారు. అయితే, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు సామర్థ్యం పెంపు వల్ల అనేక ప్రాజెక్టులకు నీళ్లు రావడంలో మార్పులు చూపితే కూడా నిజానికి నీటి విడుదల విషయంలో సరైన సమాధానాలు లేవని వ్యాఖ్యానించారు. ఇక, శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడానికి 881 అడుగులు కావాలన్నారు.. కానీ, ఆ స్థాయికి నీటిని నిలుపకపోవడం వల్ల ఇబ్బందులు కొనసాగుతుండటాన్ని శ్రీకాంత్ ప్రశ్నించారు. అంతేకాదు, నారాయణపూర్, జూరాల నిండిన తర్వాతే శ్రీశైలం నీళ్లు రావాల్సిన అవసరం ఉన్నప్పటికీ.. ఇప్పటి వరకు సరైన చర్యలు తీసుకోలేదన్న అనుమానం వ్యక్తం చేశారు. నీటి హక్కులు, ప్రాజెక్టులను అమలు చేసే విధానంలో సమ సమానత్వం లేదు అని, దిగువ రాష్ట్రాలకు ఎక్కువ హక్కులు ఉన్నట్టు భావిస్తున్నామని కూడా ఆయన అభిప్రాయపడ్డారు. వైఎస్ఆర్, జగన్ ప్రభుత్వం తొలగించిన ప్రాజెక్టులు, నీటి పంపిణీ సముచితంగా జరగడం లేదని విమర్శించారు. మీరు వాదించే అంశాలను బట్టి మీరు చెబుతున్నది సరైనదేనా? అన్న ప్రశ్నను నేరుగా చంద్రబాబుకే వేశారు.. అయితే, ఎగువ ప్రాజెక్టులపై చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఇద్దరూ కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు.

## భర్తను హత్య చేసిన కేసులో ట్విస్ట్

**ఇన్సూరెన్స్ డబ్బులతో పాటు ప్రియుడిపై మోజు**

**హత్య కేసులో పోలీసులు నిర్ధారణ**

**నిజామాబాద్:** భర్తను హత్య చేసి, గుండెపోటుగా చిత్రీకరించిన ఘటనలో కొత్త ట్విస్ట్ చోటుచేసుకుంది. భర్త పల్లటి రమేష్‌పై రూ.2 కోట్లకు పైగా ఇన్స్యూరెన్స్ ఉండగా.. బీమా డబ్బుల కోసమే భార్య సౌమ్య, ప్రియుడు దిలీప్ పక్క ప్లాన్ చేసినట్లు పోలీసులు తేల్చారు. వివాహేతర సంబంధానికి అడ్డు తొలగించుకోవటం ఆపై ఇన్స్యూరెన్స్ డబ్బులతో పారిపోవడానికి ఎలాన్ చేశారు. ఇన్స్యూరెన్స్ డబ్బుల కోసం నార్మల్ డెత్ గుండె పోటు అంటూ చిత్రీకరించారు. నిద్ర మాత్రలు ఇచ్చి భర్తగొంతు నులిమి హత్య చేసి హార్ట్ ఎటాక్‌గా భార్య నమ్మించింది. మృతుడి తమ్ముడి ఫిర్యాదుతో మృతదేహానికి రీపోస్టు మార్టం నిర్వహించారు. పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. విచారణలో తామే హత్య చేసినట్లు భార్య సౌమ్య, ప్రియుడు దిలీప్ ఒప్పుకున్నారు. పోలీసుల వెల్లడించిన వివరాలు ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మక్లూర్ మండలం బొర్గాం గ్రామానికి చెందిన పట్టాటి రమేష్ భార్య సౌమ్య ఓ ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తోంది. అదే పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న దిలీప్‌తో ఆమెకు పరిచయం.. వివాహేతర సంబంధంగా మారింది. ఈ విషయం భర్త రమేష్‌కు తెలియడంతో, ఇద్దరినీ గట్టిగా మందలించాడు.దీంతో భర్త అడ్డు తొలగించుకోవాలని సౌమ్య ప్రియుడితో కలిసి ఎ÷-లాన్ చేసింది. గత నెల 20న సౌమ్య తన ప్రియుడు దిలీప్‌తో కలిసి రమేష్‌ను ఇంట్లోనే హత్య చేశారు. అనంతరం భర్త గుండెపోటుతో మృతి చెందినట్లు నమ్మించి, ఎవరికీ అనుమానం రాకుండా హడావుడిగా అంత్యక్రియలు నిర్వహించారు. అయితే, అంత్యక్రియల సమయంలో రమేష్ మెడపై గాట్లు కనిపించడంతో స్థానికులకు అనుమానం కలిగింది. వెంటనే ఇజ్రాయెల్‌లో ఉన్న అతని తమ్ముడు కేదారికి సమాచారం అందించడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి విచారణ చేపట్టగా అసలు నిజం బయటపడింది. ఈ కేసులో సౌమ్యతో పాటు మరో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## టీమ్ వర్క్‌తో రాష్ట్ర బ్రాండ్ నిర్మాణం

**పెట్టుబడుల వెల్లువతో ఆశాజనక పరిస్థితి**

**మంత్రులు, అధికారుల పనితీరే కారణం**

**పెట్టుబడుల ప్రొత్సాహక బోర్డు సమావేశంలో బాబు**

**అమరావతి:** 2025 ఏడాదిలో పెట్టుబడులు అద్భుతంగా వచ్చాయని... అదే ఉత్సాహంతో 2026లో పనిచేయాలని మంత్రులు, అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుసూచించారు. 2025లో అంతా కలిసి టీమ్ వర్క్ చేశామని... అందుకే మంచి ఫలితాలు వచ్చాయని అన్నారు. మంగళవారం నాడు సచివాలయంలో సీఎం అధ్యక్షతన 14వ ఎస్ఐపీబీ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రొత్సాహక బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి మంత్రులు, అధికారులు అద్భుతంగా పని చేశారంటూ కితాబిచ్చారు. గత ప్రభుత్వ పాలనలో పోయిన బ్రాండ్ తిరిగి వచ్చిందని.. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయన్నారు. భారీ పరిశ్రమలు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని తెలిపారు. టాటా, జిందాల్, బిర్లా, అదానీ, రిలయన్స్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రముఖ సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టాయని సీఎం అన్నారు. ఏ చిన్న పొరపాటు తావివ్వకుండా మంత్రులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సులో ఫలితాలు రావాలనే లక్ష్యంతో పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు.. విద్యుత్ రంగంలో అద్భుతంగా పనిచేశామన్నారు. 13 పైసలు విద్యుత్ ఛార్జీలు తగ్గించామని సీఎం వెల్లడించారు. రూ. 4500 కోట్ల ట్రూఅప్ ఛార్జీల భారాన్ని ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరించాలని నిర్ణయించామన్నారు. విద్యుత్ కొనుగోళ్ల ధరలను కూడా తగ్గించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం పడకుండా చూడడం తనకు చాలా సంతోషాన్నిచ్చిందని అన్నారు. విద్యుత్ రంగంలో ప్రభుత్వం చేసిన కృషి వల్లే డేటా సెంటర్లు వచ్చాయని సీఎం తెలిపారు. విద్యుత్ రంగంతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులు బాగా వచ్చాయన్నారు. దావోస్ సదస్సుకు వెళ్లామని.. ఏపీ బ్రాండ్ ప్రమోట్ చేయగలిగామని అన్నారు. అలాగే విదేశీ కంపెనీలను ఆకర్షించగలిగామని సీఎం తెలిపారు. గూగుల్ సెంటర్ ఏపీకి తీసుకురావడానికి లోకేష్ కృషి చేశారని తెలిపారు. సక్సెస్ ఇచ్చే కిక్ అద్భుతంగా ఉంటుందని... ఆ కిక్ కోసం అందరూ పని చేయాలని సూచించారు.

## హిల్ట్ పాలసీలో లోపాలు సవరించాలి

**హైదరాబాద్:** హిల్ట్ పాలసీకి సంబంధించి సబ్ కమిటీ నిర్ణయాలను ఎందుకు బయట పెట్టలేదని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. జీవో 27 చాలా వివాదాస్పదంగా ఉందని అన్నారు. హిల్ట్ పాలసీపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. జీవో లీక్ కావడంపై ప్రభుత్వంలో ఆందోళన ఉంది. టౌన్‌షిప్‌లు, అపార్ట్‌మెంట్‌లు ఉండాలని జీవో 27లో ఉంది. అతితక్కువ ధరకు భూములు ఇచ్చారు. 22 పారిశ్రామికవాడలను అన్యాక్రాంతం చేస్తున్నారు. ఫార్మాసిటీకోసం రైతుల నుంచి సేకరించిన భూములను ఫోర్త్ సిటీకి ఉపయోగిస్తున్నారు. ఆ భూములపై హైకోర్టు అఫిడవిట్ అడిగింది. పరిశ్రమలను మూసివేసేలా ప్రస్తుత పాలసీ ఉంది. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేసే అధికారం ప్రస్తుత ప్రభుత్వానికి ఉంది. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలో తప్పులు ఉంటే వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. అంతేగానీ పరిశ్రమల భూములను రియల్ ఎస్టేట్ భూములుగా మార్చాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. ఇది సరికాదన్నారు. భారత రాష్ట్ర సమితికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 43,342 జీవోలు దాచి పెట్టింది.

# స్మార్ట్ వ్యవసాయంతో రైతు ఆదాయం పెంపు

**ప్రతి నీటి చుక్కను ఆదాయంగా మారుస్తాం**

**సుస్థిర వ్యవసాయం దిశగా ఆంధ్రప్రదేశ్**

**ఆటోమేషన్ మైక్రో ఇరిగేషన్‌తో దిగుబడులు పెంపే లక్ష్యం**

**వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**అమరావతి:**ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగం సాంకేతికత, ఖచ్చితత్వం, స్థిరమైన అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళవారం విజయవాడలోని గవర్నర్ పేట నందు గల సమగ్ర జలవనరుల నిర్వహణ / రైతు శిక్షణ కేంద్రంలోని సమావేశ మందిరంలో రాష్ట్ర ఉద్యానశాఖ ఆధ్వర్యంలో సూక్ష్మ సాగునీటిలో ఆటోమేషన్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ నీటి వనరుల తగ్గుదల, వాతావరణ మార్పులు, సాగు వ్యయాల పెరుగుదల వంటి సవాళ్ల మధ్య రైతును కాపాడాలంటే వ్యవసాయాన్ని స్మార్ట్ వ్యవసాయంగా మార్చాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేశానికి మార్గదర్శకమైన మైక్రో ఇరిగేషన్‌ను మరింత బలోపేతం చేస్తూ, 'పర్ డ్రాప్ మోర్ క్రాప్' నుంచి 'పర్ డ్రాప్ మోర్ రిటర్న్స్' దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. ఇకపై నీరు, ఎరువుల వినియోగం ఊహలపై కాకుండా సెన్సర్లు, డేటా, ఆటోమేషన్ ఆధారంగా జరగడంతో 20?30 శాతం నీటి ఆదా, కార్మిక వ్యయాల తగ్గింపు, దిగుబడి,నాణ్యత పెరుగుదల సాధ్యమవుతాయని చెప్పారు. ఉద్యాన, తోట, షేడ్ నెట్, గ్రీన్ హౌస్ మరియు అధిక విలువైన పంటలకు ఈ పథకం అత్యంత ఉపయోగకరమని వివరించారు. ఖఓఐ÷ూజ కింద హెక్టారుకు 40,000 వరకు మద్దతుతో రాష్ట్రవ్యాప్తంగా అమలు జరుగుతోందని తెలిపారు. చిన్న, సన్నకారు ఎస్సీ,ఎస్టీ రైతులకు 55శాతం, ఇతర రైతులకు 45 శాతం సబ్సిడీ అందిస్తూ, ఇప్పటికే ఉన్న డ్రిప్‌లలోనూ ఆటోమేషన్ అమర్చుకునే వీలుందని చెప్పారు. ఎంపానెల్ చేసిన కంపెనీల ద్వారానే పారదర్శక అమలు, స్థిర ధరలు, అధికారి తనిఖీ అనంతరమే చెల్లింపులు, ప్రతి భాగంపై 'ఎఆర్ఎంపి' ముద్ర తప్పనిసరిగా ఉంటుందని పేర్కొన్నారు. వారంటీ, సర్వీస్ సపోర్ట్, త్వరితగతిన ఫిర్యాదు పరిష్కారం కల్పిస్తూ రైతును ఎప్పుడూ భరోసాగా నిలబెడతామని స్పష్టం చేశారు. నీటి, విద్యుత్, ఎరువుల ఖర్చులు తగ్గి, దిగుబడులు పెరిగి, రైతు ఆదాయం స్థిరపడేలా ఆటోమేషన్ ఆధారిత మైక్రో ఇరిగేషన్ వ్యవసాయ సంస్కరణగా నిలుస్తుంది. స్మార్ట్ వ్యవసాయంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికి ఆదర్శంగా నిలబెడదామని మంత్రి అచ్చెన్నాయుడు గారు అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, ఉద్యాన శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

### భోగాపురం పూర్తి చేసిన ఘనత బాబుదే

**అమరావతి:** భోగాపురం విమానాశ్రయానికి అనుమతులు తీసుకుని రావడంతో పాటు, పూర్తి చేసిన ఘనత సిఎం చంద్రబాబుకు దక్కుతుందని తెదేపా నేత పట్టాభిరామ్ అన్నారు. పట్టుదలతో విమానాశ్రయం పూర్తి చేయించిన చంద్రబాబు అభినదనీయుడన్నారు. అయితే దీనికి అనుమతులు తెచ్చామంటూ వైకాపా అవాస్తవాలు ప్రచారం చేస్తోందని పట్టాభిరామ్ అన్నారు. 2016లోనే సైట్ క్లియరెన్స్ అనుమతులను సీఎం చంద్రబాబు సాధించారని చెప్పారు. భూసేకరణతో పాటు రైతులకు నష్టం జరగకుండా జీవో ఇచ్చారన్నారు. విమానాశ్రయానికి చంద్రబాబే అంకురార్పణ చేశారని వివరించారు. భోగాపురం విమానాశ్రయంపై పట్టాభి ప్రజెంటేషన్ ఇచ్చారు. భోగాపురం విమానాశ్రయానికి చంద్రబాబు ఎస్‌పీవీ ఏర్పాటుచేశారు. దీనికోసం అధికారులను నియమించారు. చంద్రబాబు క్రెడిట్ చోరీ చేస్తున్నట్లు వైకాపా పేటీఎం బ్యాచ్‌లు ఆరోపిస్తున్నాయి. వైకాపా పాత్ర ఇక్కడ ఏమీ లేకపోయినా తామే చేసినట్లు చెప్పుకొంటున్నారు. విమానాశ్రయం నిర్మాణాన్ని అడ్డుకుంటామని పార్టీ నేతలు గతంలో వ్యాఖ్యానించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు క్రెడిట్ చంద్రబాబుకే దక్కుతుంది. ఈ ప్రాజెక్టు వేగవంతానికి 2017లోనే స్టీరింగ్ కమిటీ ఏర్పాటైంది. కీలకమైన పర్యావరణ అనుమతులు తీసుకొచ్చాం' అని పట్టాభి వివరించారు.

### అశాస్త్రీయంగా జిల్లాల ఏర్పాటు

**హైదరాబాద్:** తెలంగాణలో గత ప్రభుత్వం జిల్లాలు, మండలాలను అశాస్త్రీయంగా, అసంబద్ధంగా రూపొందించిందని రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. దీనిని సవరించాల్సి ఉందన్నారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి మాట్లాడుతూ..మ్యాజిక్ ఫిగర్ కోసమే రాష్ట్రంలో మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టిందని విమర్శించారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో అశాస్త్రీయంగా జరిగిన మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పునర్వ్యవస్థీకరణను సరిచేస్తామని పొంగులేటి పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వ తప్పిదాలతో ఒకే నియోజకవర్గంలోని నాలుగు మండలాలు.. నాలుగు జిల్లాల్లో ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిపై అసెంబ్లీలో చర్చించి అందరి ఆమోదంతో పునర్వ్యవస్థీకరణ చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు.

### సింగరేణిలో త్వరలో క్యాథ్ ల్యాబ్: భట్టి

**హైదరాబాద్:** సింగరేణి కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. 75 రోజుల్లో గోదావరిఖనిలో క్యాత్ ల్యాబ్ ప్రారంభిస్తామని చెప్పారు. సింగరేణిపై శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 32మంది వైద్యుల కోసం నోటిఫికేషన్ ఇచ్చాం. త్వరలో భర్తీ చేస్తాం. 176 మంది పారామెడికల్ సిబ్బంది నియామక ప్రక్రియ జరుగుతోంది. సింగరేణి ఆస్పత్రుల్లో మార్చి నాటికి వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తాం. విశ్రాంత ఉద్యోగులు అక్కడ మందులు అందించేలా చర్యలు చేపడతాం అని భట్టి విక్రమార్క తెలిపారు.రాయలసీమ ఎత్తిపోతలను పరిశీలించిన వైఎస్సార్‌సీపీ నేతలు నంద్యాల,జనవరి6(ఆర్ఎన్ఎ): రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్ట్‌ను వైఎస్సార్‌సీపీ నేతలు సందర్శించారు. మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, కల్పలతరెడ్డి, శివరామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, సమన్వయ కర్త దారా సుధీర్ పరిశీలించారు. రాయలసీమ ద్రోహి చంద్రబాబు అంటూ వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమలోని ఉమ్మడి నాలుగు జిల్లాలను సస్యశ్యామలం చేయాలనేది వైఎస్ జగన్ కల.. 2020లో రాయలసీమ ఎత్తిపోతలకు వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారన్నారు. రూ.3,207 కోట్ల వ్యయంతో వైఎస్ జగన్ రాయలసీమ ప్రాజెక్టును చేపట్టారు. చీకటి ఒప్పందం చేసుకునే చంద్రబాబు రాయలసీమ ప్రాజెక్టును వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### 2047 నాటికల్లా 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం

**హైదరాబాద్**: తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికల్లా 3 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలనే దృఢమైన సంకల్పంతో ముందుకు సాగుతున్నామని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగానే పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. శాసనమండలిలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారులకు సులువుగా ఉండే విధంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానాన్ని తీసుకొచ్చా మన్నారు. తెలంగాణ రైజింగ్ సదస్సులో రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఈనెల 19న మరోసారి వరల్డ్ ఎకనమిక్ సమిట్‌కు వెళుతున్నామని, భారీగా పెట్టుబడులు తీసుకొస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. హ్యూసెంట్రియో, సిస్టా ఐటీ సంస్థల ద్వారా వెయ్యి చొప్పున ఉద్యోగాలు వస్తాయని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. జాబ్ క్యాలెండర్ విషయంలో సామాజిక అంశం పరిశీలిస్తూన్నామని అన్నారు. ఉబెర్ సంస్థతో ఒప్పందం చేసుకున్నామని.. త్వరలో ఏర్పాటు చేస్తుందని, కాగ్నిజెంట్ సంస్థ ద్వారా 5 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని తెలియజేశారు. పోచారం ఇన్ఫోసిస్ సంస్థ విస్తరణ ద్వారా 17 వేల మంది ఉపాధి, విప్రో సంస్థ విస్తరణ ద్వారా మరో 5 వేల మందికి ఉపాధి ఉంటుందని అన్నారు. 70 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు తెచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని కొనియాడారు. ఇప్పటికే 70 జిసిసిలు రాష్ట్రానికి వచ్చాయని.. సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ కంప్యూటింగ్ లో ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే జినోమ్ వ్యాలీ నాలుగో దశ కూడా పూర్తయిందని, ఐటీ కంటే ఎక్కువగా ఫార్మా ఎగుమతులు జరుగుతున్నాయని అన్నారు. ఏరోస్పేస్, రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు ఎక్కువగా జరుగుతున్నాయని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

### నారాయణపేట జిల్లాలో విషాద ఘటన

**నారాయణపేట:** నారాయణపేట జిల్లా మరికల్ మండలం తీలేరు గ్రామంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. ఓ తండ్రి ఇద్దరు చిన్న పిల్లలను హత్య చేసి తానూ ఆత్మహత్యాయత్నాని కి పాల్పడిన విషాద సంఘటన తీవ్రంగా కలచివేసింది. తీలేరు గ్రామానికి చెందిన శివరాం తన ఇద్దరు పిల్లలు రిత్విక (8), చైతన్య (5)లను కోయిల్ సాగర్ కెనాల్‌లోకి తోసివేసి హత్య చేశాడు. కెనాల్‌లో పడిన ఇద్దరు చిన్నారులు అక్కడికక్కడే మృతి చెందారు. అనంతరం శివరాం కూడా ఆత్మహత్యకు ప్రయత్నించాడు. స్థానికులు గుర్తించి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పోలీసుల ప్రాథమిక విచారణలో శివరాం కొన్నేళ్లుగా భార్యతో దూరంగా ఉంటూ మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు తెలుస్తోంది. కుటుంబ సమస్యలే ఈ ఘోరానికి కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

# రాజకీయ అవినీతికి శిక్ష ఏదీ

రాజకీయ అవినీతికి శిక్షలు లేకుండా పోయాయి. విచారణలు ఏళ్లకు ఏళ్లు సాగుతుంటాయి. ఆధారాలు ఉండవు. ఉన్నా వాటిని మాయం చేస్తారు. భారతదేశంలో రాజకీయ అవినీతి కారణంగా రాజకీయ పార్టీలు ఆడిందే ఆటగా సాగుతోంది. ఉభయ తెలుగు రాష్ట్రాలను తీసుకుంటే విభజన తరవాత ఉమ్మడి ఎపి నష్టపోయినంతగా గతంలో ఏ రాష్ట్రం కూడా నష్టపోలేదు. ఈ విభజన కేవలం కెసిఆర్ కుటుంబాన్ని, జగన్ కుటుంబాన్ని మాత్రమే కోటీశ్వరులను చేసింది. విభజనతో తెలంగాణ దగాపడ్డదన్నది ముమ్మాటికీ నిజం. ఉద్యమకారుల ముసుగులో నాటి పాలకులు వ్యూహాత్మకంగా ప్రజలను నమ్మించి మోసం చేశారు. ఈ క్రమంలో అప్పులు చేసి రెండు రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెట్టారు. బంగారు తెలంగాణ, ధనిక తెలంగాణ అంటూ కెసిఆర్ తడిబట్టతో గొంతు కోశారు. వీరి నేరాలను రుజువు చేసేదెవరు? ఎందుకంటే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో రెండేళ్లయినా కెసిఆర్ అవినీతిపై విచారణ జరగడం లేదు. ఏ కేసులోనూ అవినీతిని రుజువు చేసే చర్యలు చేపట్టలేదు. అలాగే చంద్రబాబు నాయుడు కూడా జగన్ అవినీతి వ్యవహారాలపై మాట్లాడడం లేదు. విచారణలు జరగడం లేదు. జగన్‌ను తిట్టిపోయ డమే తప్ప చేసిదేమీ లేదు. దీనిని బట్టి రాజకీయ పార్టీలు అవగాహనతో ఉంటున్నాయన్న అనుమానం ప్రజల్లో ఉంది. అయితే తాజాగా కవిత తన సొంత కుటుంబం పైనా, బిఆర్‌ఎస్ వ్యవహారాల పైనా చేసిన ఆరోపణలు పరిశీలిస్తే.. గత పదేళ్లుగా ప్రజలు ఇవే అంశాలపై చర్చించారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత ఎంతగా నష్టపోయామో కుమిలిపోయారు. అందుకే కెసిఆర్‌ను ఓడించి సంబుర పడ్డారు. అయితే ఇప్పుడ చెబుతున్న విషయాలపై ఆనాడు కవిత వేటికీ స్పందించలేదు. లక్షల కోట్లకు కెసిఆర్ కుటుంబం, ఆయన అనుచరులు, ఆనాటి మంత్రులు, ఇలా అంతా పడగలెత్తారు. కానీఒక్కటంటే ఒక్కటి కూడా బయటకు రాలేదు. ఓ ఉద్యోగి వేయి రూపాయలు లంచం తీసుకుంటే పట్టుకుంటున్న పోలీసులు కూడా వారిని పట్టుకునే ప్రయత్నం చేయడం లేదు. దీనిపై కేంద్రం కూడా నాలుగు రాళ్లు వేసి ఊరుకుంటుందే తప్ప పట్టించుకోవడం లేదు. ఇలా ఏళ్లుగా అవినీతి కేసుల నుంచి రాజకీయ పార్టీల నేతలు సమర్థంగా తప్పించు కుంటున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ కేసే ఇందుకు పెద్ద ఉదాహరణ. తాజాగా కెసిఆర్ తనయ కవిత ఇప్పుడు సంచలన ఆరోపణలు చేశారు. ఎంతగా అవినీతి జరిగిందో తెలియచేశారు. తండ్రి, బావ అన్నలతో పాటు ఆనాటి మంత్రులు ఎవరెవరు ఎంతగా మేశారో చెప్పారు. వీటి ఆధారంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. దీనిపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు కూడా స్పందించి, చర్యలకు డిమాండ్ చేశారు. ఇప్పుడు నిజాయితీ నిరూపించుకోవాల్సిన బాధయత సిఎం రేవంత్‌పై ఉంది. అవినీతి పట్ల ఆచన వైఖరి ఏంటన్నది తెలియాలి. తెలంగాణ వచ్చాక మంచి జరుగుతుందని ప్రజలకు ఆశ ఉండేదని, కానీ, వారి ఆశలన్నింటినీ పదేళ్ల కాలంలో అడియాసలు చేశారని కవిత స్వయంగా ప్రకటించారు. ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వలేదు సరికదా.. తెలంగాణ కోసం పోరాడిన లక్షలాదిమంది ఉద్యమకారులకు గౌరవం కూడా దక్కలేదు. చివరికి, అమర వీరుల స్మారక స్తూపం, అంబేడ్కర్ విగ్రహం నిర్మాణంలోనూ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నుంచి బయటకు వచ్చిన తరవాత ఆమె తరచూ అవినీతిపై ఆరోపణలు చేస్తూ వచ్చారు. తనది ఆత్మగౌరవ పోరాటమని, ఆస్తుల పంచాయితీ కాదని అంటోంది. అయితే ఆస్తుల పంచాయితీ అని ఇప్పుడు స్పష్టంగా తేలిపోయింది. ఎందుకంటే లక్షల కోట్ల అవినీతి సొమ్మును దాచుకుని తనకు వాటా ఇవ్వలేన్న బాధతోనే ఆమె బయటకు వచ్చారు. లేదా ఆస్తి అడిగతే గెంటివుంటారు. ఈ రెంటిలో ఏదో ఒకటి అయివుంటుంది. అందుకే ఆమె బాధను మింగలేక తన తండ్రి కేసీఆర్‌పైనా, ఆయన పాలనపైనా తీవ్ర ఆరోపణలు చేశారు. కొద్ది రోజులుగా తనలో దాచుకున్న ఆక్రోశాన్ని వెళ్లగక్కుతూ భావోద్వేగానికి గురయ్యారు. కొత్తగా వచ్చినవాళ్లు, ఉద్యమంతో సంబంధం లేని వాళ్లు సైతం తెలంగాణ ఉద్యమంలో తన పాత్ర ఏమిటని ప్రశ్నిస్తున్నారని, అందుకే ఈ విషయాలు చెబుతున్నానని కవిత వ్యాఖ్యానించారు. ఇక కాళేశ్వరం కెసిఆర్ ఎటిఎంగా మారిందని స్వయంగా ప్రధాని మోడీ, అమిత్ షాలు పదేపదే ఆరోపించారు పదేళ్లలో రూ.1.89 లక్షల కోట్లు ఖర్చు చేసి 14 లక్షల ఎకరాలకే నీళ్లు ఇచ్చారని, అవే డబ్బులతో 25 లక్షలమంది పేదలకు ఇళ్లు ఇవ్వవచ్చునని తాజాగా కవిత కూడా వ్యాఖ్యానించారు. ఉద్యమకారుల సమస్యలు కేసీ ఆర్‌కు చేరకుండా అడ్డుగోడ కట్టారని విమర్శించిన కవిత ఆనాడు తానూ ఓ సిఎం కూతురుగా, ఎంపిగా ఉన్నానన్న విషయం మరచి పోయారు. ఈ విషయాలన్నీ ఆనాడే అంతర్గతంగా అయినా లేవనెత్తి ఉంటే వాటికి విలువ ఉండేది. తెలంగాణలో అవినీతి లేని పారదర్శక విధానాన్ని చూడాలనుకున్నామని, కానీ జరగలేదని కవిత వ్యాఖ్యానించారు. అంటే కెసిఆర్ అవినీతి పాలన నిజమే అని కవత చెప్పేశారు. పారదర్శకత అన్నది ముసుగు అన్నది కూడా తేలిపోయింది. పార్టీలో, ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని కవిత వెల్లడించారు. కొంతమంది ప్రజా ప్రతినిధులు చేస్తున్న అవినీతిని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు లేవని వివరించారు. అమరజ్యోతి, సచివాలయం, అంబేడ్కర్ విగ్రహం, కలెక్టరేట్ల నిర్మాణంలో అవినీతి జరిగింది. సిద్దిపేట, సిరిసిల్లలో కట్టిన కలెక్టరేట్లు ఒక్క వర్షానికే మునిగిపోయాయి. 1969 ఉద్యమకారులనూ గుర్తించలేదు. నీళ్లు, నిధులు, నియామకాల ట్యాగ్‌లైన్‌కు గండికొట్టేశారు. ఇసుక దందాల కారణంగా నేరెళ్ల లాంటి దురాగతాలు జరిగాయని, అయినా అప్పట్లో చర్యలు తీసుకోలేదని తెలిపారు. తెలంగాణ వచ్చాక కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయకపోగా పెంచి పోషించారని తప్పుబట్టారు. ధర్నా చౌక్‌ను తీసేయాలని నిరయించినప్పుడు తాను వ్యతిరేకించానని, తెలంగాణ వచ్చాక ధర్నా చౌక్ ఎందుకని.. అన్ని సమస్యలనూ పరి ష్కరిస్తామని కేసీఆర్ చెప్పారని, కానీ, అవేవీ అమ లు కాలేదని తప్పుబట్టారు. మొత్తంగా కవిత తను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉండాలి. తన వద్ద ఉన్న ఆధారాలను ప్రభుత్వానికి లేదా విచారణకు సమర్పించాలి. తెలంగాణకు జరిగిన అన్యా యాలపై గళమెత్తాలి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే బాధ లు పోతాయన్న వాదనలు తప్పని తేలింది. ఆంధ్రా వాళ్లను అన్యాయంగా నిందించిన తెలంగాణ ఉద్యమకారులు ఇప్పుడు కళ్లు తెరవాలి. అసలు ద్రోహులు తెలంగాణ వారే అని గుర్తించి మరో ఉద్యమానికి సిద్ధం కావాలి.

## మోపిదేవిని సందర్శించిన కృష్ణతేజ

**విజయవాడ:** కృష్ణాజిల్లా మోపిదేవి మండలం మోపిదేవి గ్రామంలో కొలువుదీరిన శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ మంగళవారం దర్శించుకున్నారు. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆయనకు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆలయ అధికారులు స్వామివారి చిత్ర పటాన్ని, తీర్థ ప్రసాదాలను కృష్ణ తేజకు అందించారు.

## సంక్రాంతికి ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు

**అమరావతి:** సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లే వారికోసం ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రద్దీ దృష్ట్యా రోజూ నడిచే రెగ్యులర్ సర్వీసులకు అదనంగా 8,432 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. ఈసారి స్త్రీశక్తి పథకం దృష్ట్యా రాష్ట్రంలో పలు ప్రాంతాల మధ్య ప్రత్యేక బస్సుల ఏర్పాటులో ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆర్టీసీ తెలిపింది. 71 శాతం బస్సులను రాష్ట్రంలోని పలు ప్రాంతాల మధ్య ప్రత్యేక సర్వీసులుగా నడపాలని నిర్ణయించింది. గ్రామాలు, మండలాలు, పట్టణాల మధ్య రద్దీ గణనీయంగా పెరిగిన దృష్ట్యా.. వీటి మధ్య 6 వేల ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఇతర రాష్ట్రాల్లోని హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ప్రాంతాలకు 2,432 ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేందుకు కేటాయించింది. పండుగ ముందు రోజుల్లో మొత్తం 3,857 ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. వీటిలో హైదరాబాద్‌కు 240, బెంగళూరుకు 102, చెన్నైకు 15 బస్సులు ఏర్పాటు చేయగా... రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు 3500 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. పండుగ తిరుగు ప్రయాణానికి మొత్తం 4,575 బస్సులు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు 1800, బెంగళూరు 200, చెన్నై 75 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయగా.. వీటిలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల మధ్య నడిపేందుకు 2500 బస్సులు ఏర్పాటు చేశారు. ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ ఛార్జీలే వసూలు చేయనున్నట్లు ఆర్టీసీ ప్రకటించింది. దూర ప్రాంతాలకు నడిచే ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కల్పించినట్లు తెలిపింది.

## ఎరువుల గోదాం ఆకస్మిక తనిఖీ

**మిర్యాలగూడ:** జిల్లా ఎరువుల స్టాక్ పాయింట్‌గా ఉన్న మిర్యాలగూడ మండలంలోని ఎరువుల గోదాములను మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల పంపిణీ సక్రమంగా జరిగేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని వ్యవసాయ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. అనంతరం గోదాముల్లోని నిల్వలను పరిశీలించారు. రైతులు యాప్‌లో బుక్ చేసుకున్న విధంగా వారికి సంబంధిత దుకాణాల్లో ఎరువులు అందించేలా పంపిణీ చేయాలన్నారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి రద్దీకి ప్రత్యేక బస్సులు

**హైదరాబాద్:** సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఏపీ, తెలంగాణ జిల్లాలకు ఆర్టీసీ బస్సులు నడుపుతుందని రంగారెడ్డి రీజియన్ మేనేజర్ శ్రీలత తెలిపారు. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ప్రత్యేక బస్సులను నడుపుతామని అన్నారు. ఈ మేరకు స్పెషల్ ఆపరేషన్స్‌పై మహాత్మాగాంధీ బస్టాండ్‌లో పోలీస్, ట్రాఫిక్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. బస్సులపై వారికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ రాయలసీమ వైపు వెళ్లే బస్సులు ఆరాంఘర్.. ఉత్తర తెలంగాణకు జేబీఎస్.. విజయవాడ, నల్లగొండ, ఖమ్మం ప్రాంతాలకు ఎల్బీనగర్ నగర్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు చెప్పారు.

## రాజన్న ఆలయ మాజీ ప్రధానర్చకులు మృతి

**వేములవాడ:** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విశ్రాంత ప్రధాన అర్చకులు, స్థానాచార్యులు శ్రీ అప్పాల భీమాశంకర్ మృతి చెందారు. ఆయన మరణంపట్ల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన సంతాపం తెలియజేశారు. రాజన్న ఆలయానికి భీమాశంకర్ చేసిన సేవలు మరువలేనివి కొనియాడారు. గతంలో తాను వేములవాడ రాజన్న ఆలయాన్ని సందర్శించినప్పుడు దగ్గరుండి పూజ కార్యక్రమాలు నిర్వహించారని కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం రాజన్న భక్తులకు, వేములవాడ ప్రాంతానికి తీరనిలోటని అన్నారు. భీమాశంకర్ గారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## 10 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి సెలవులను ప్రకటించింది. జనవరి 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు అన్ని పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ఇస్తున్నట్లు ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. ఈ సెలవులు ప్రభుత్వ, ప్రైవేటు, వాణిజ్య పాఠశాలలకు వర్తిస్తాయని పేర్కొంది. జనవరి 16వ తేదీన కనుమ రోజును పురస్కరించుకుని ఐచ్ఛిక సెలవు కూడా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. కనుమ రోజున రైతులు తమ పండుగను ప్రత్యేకంగా చేసుకుంటారు. కనుమ రోజున ఉత్సవాలు, పండుగ సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జనవరి 17వ తేదీ నుంచి అన్ని పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయని స్పష్టం చేసింది. ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులను తమ ఇళ్లకు తీసుకురావడానికి తల్లిదండ్రులు ప్లాన్ చేసుకుంటున్నారు.

## ఆస్పత్రిలో చేరిన సోనియా గాంధీ

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్లమెంటరీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలో ఆమెను కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రిలో చేర్పించారు. సోనియాగాంధీ తీవ్రమైన దగ్గుతో బాధపడుతున్న నేపథ్యంలో ఆమెను వైద్యులు పర్యవేక్షణలో ఉంచారు. ఆస్పత్రి వర్గాల సమాచారం ప్రకారం.. సోనియా గాంధీకి సీనియర్ పల్మనాలజిస్ట్ పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి స్థిరంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలో నెలకొన్న తీవ్ర వాయు కాలుష్యం కారణంగానే సోనియా గాంధీకి ఈ అనారోగ్యం ఏర్పడినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. కాలుష్య స్థాయిలు పెరగడంతో శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని వైద్యులు సూచించారు. వైద్యుల సూచనల మేరకు సోనియాగాంధీకి అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా వైద్యులు గమనిస్తున్నట్లు సమాచారం. కాగా గతంలోనూ సోనియాగాంధీ పలు ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే.

# వెనెజువెలా అధ్యక్ష భవనం వద్ద కాల్పులు

### మాకు సంబంధం లేదని ప్రకటించిన అమెరికా

**కారకాస్:** వెనెజువెలా రాజధాని కారకాస్‌లోని అధ్యక్ష భవనం వద్ద భారీ కాల్పులు, పేలుళ్ల కలకలం రేపాయి. అధ్యక్షుడు నికోలస్ మదురోను యూఎస్ భద్రతా సిబ్బంది అరెస్ట్ చేసి తీసుకెళ్లిన తరువాత వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా డెల్సీ రోడ్రిగ్జ్ ప్రమాణం స్వీకారం చేశారు. ఇది జరిగిన గంటల వ్యవధిలోనే అంటే సోమవారం రాత్రి సమయంలో కారకాస్‌లోని అధ్యక్ష భవనంపై గుర్తు తెలియని డ్రోన్ సంచరించింది. దీనిని గమనించిన భద్రతా దళాలు.. డ్రోన్‌పై అటాక్ చేశాయి. భారీగా కాల్పులు జరిపాయి. ప్రస్తుతం అక్కడ వాతావరణం ప్రశాంతంగా ఉన్నట్లు సమాచారం. కాగా, ఈ కాల్పులకు ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఇదిలాఉంటే.. ఈ కాల్పుల ఘటనకు అమెరికాకు సంబంధం లేదని వైట్‌హౌస్ నుంచి ఒక ప్రకటన వచ్చింది. డ్రోన్ విషయంలో అమెరికా ప్రమేయం ఏమాత్రం లేదని ప్రకటనలో పేర్కొంది వైట్‌హౌస్. ఇకపోతే అమెరికా డెల్టా ఫోర్స్ సైన్యం జనవరి 3వ తేదీన వెనెజువెలాపై దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్య సిలియా ఎ÷-లోర్స్‌ను కస్టడీలోకి తీసుకుంది. తాజాగా నికోలస్ మదురోను, ఆయన భార్య సిలియాను అమెరికా అధికారులు న్యూయార్క్ కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టులో మదురో తన వాదనలు వినిపిస్తూ.. తాను ఏ తప్పూ చేయలేదని, తనను కిడ్నాప్ చేశారని జడ్జి ముందు స్టేట్‌మెంట్ ఇచ్చారు. మదురోపై ఉన్న నార్కో టెర్రరిజం ఆరోపణలను జడ్జి ఆల్విన్ హెల్లర్ స్టీన్ చదివి వినిపించగా.. అందుకు మదురో సమాధానం ఇస్తూ, తాను నిర్దోషినని, తనకు ఏమీ తెలియదని జవాబు ఇచ్చారు. అంతకు ముందు మదురోను కోర్టుకు తీసుకెళ్తున్న విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ వీడియోలో మదురో కుంటుతున్నట్టు నడుస్తున్నారు. మదురో చేతికి సంకెళ్లు వేసి ఉన్నాయి. బూడిద రంగు ట్రాక్‌సూట్ ధరించి ఉన్న ఆయన సాయుధ ట్రక్కు నుంచి దిగి నెమ్మదిగా హెలికాప్టర్ వైపు నడుస్తున్నారు. ఆ వీడియో చూసిన వాళ్లు మదురోకు గాయాలు అయినట్టు అనుమానిస్తున్నారు. మదురో ఇప్పటికీ తనను తాను వెనెజువెలా అధ్యక్షుడిగా న్యాయమూర్తికి పరిచయం చేసుకున్నారు. తాను అక్కడ కిడ్నాప్‌నకు గురయ్యానని చెప్పారు. కాగా, మదురో భార్య సిలియా ప్లోర్స్ కూడా న్యాయమూర్తికి తన వాదన వినిపించారు. తాను ఏ తప్పు చేయలేదని, పూర్తిగా అమాయకురాలినని జవాబు ఇచ్చారు. కాగా, మదురోపై మోపిన అభియోగాలను క్షుణ్ణంగా పరిశీలించిన జడ్జి ఆల్విన్ హెల్లర్ స్టీన్.. తదుపరి విచారణను మార్చి 17కు వాయిదా వేశారు.

# క్రాప్ హాలీడే ఇచ్చిన ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎత్తిపోస్తారా

### జూరాల నుంచి నీళ్లు ఎత్తిపోయడం అసాధ్యం

### కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

**మహబూబ్‌నగర్:** జూరాల నుంచి పాలమూరు లిఫ్ట్ పెడితే ఒక్క చుక్క నీరు కూడా రాదని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఎన్ని రోజులు పంపింగ్ చేసినా లాభం ఉండదని అన్నారు. మహబూబ్ నగర్ జిల్లాను ఎడారిగా మార్చే ఆలోచనలు చేస్తున్నారని అన్నారు. దీనిపై ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎందుకు ఈ ప్రాజెక్టు గురించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడలేదని ప్రశ్నించారు. యాసంగిలో జూరాల ప్రాజెక్టు కింద ఆయకట్టుకు క్రాప్ హాలీ డే ఇచ్చారని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి గుర్తుచేశారు. క్రాప్ హాలీడే ఇచ్చిన ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎత్తిపోస్తారా అని ప్రశ్నించారు. జూరాల నుంచి నీళ్లు ఎత్తిపోయడం అసాధ్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు మళ్లీ తొండి మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ నేతలు అజ్ఞానంతో మాట్లాడటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. బూత్‌పూర్ రిజర్వాయర్ నుంచి నీటిని ఎలా ఎత్తిపోస్తారని ప్రశ్నించారు. పాలమూరులో పడావు పడ్డ ప్రాజెక్టులపై గులాబీ పార్టీ సమరభేరీ మోగించింది. ఈ క్రమంలో జూరాల ప్రాజెక్టును మాజీ మంత్రులు నింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో కూడిన బీఆర్‌ఎస్ ప్రతినిధుల బృందం సందర్శించింది. నార్లపూర్ పంప్‌హౌజ్, రిజర్వాయర్, వ్టటెం పంప్‌హౌజ్, కరివెన రిజర్వాయర్లను సందర్శించారు. ప్రాజెక్టులను పడావు పెట్టిన ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అట్టర్ ఎ÷-లాప్ అవుతుందని విమర్శించారు. కొడంగల్ లిఫ్ట్‌తో ప్రజాధనం కచ్చితంగా వృథా అవుతుందని అన్నారు. కేసీఆర్ గొప్పగా ప్రాజెక్టు డిజైన్ చేస్తే.. దాన్ని పడావు పెట్టారని మండిపడ్డారు. కాల్వలకు టెండర్లు పిలిచి పూర్తి చేస్తే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలకు నీళ్లు వస్తాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అవగాహన లేకుంటే నిపుణులతో మాట్లాడి తెలుసుకోవాలని సూచించారు. మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇచ్చి కమీషన్లు దండుకున్న ఘనత కాంగ్రెస్ పాలకులదే అని లక్ష్మారెడ్డి విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం పూర్తయ్యాయని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చి ఉంటే ఆరు నెలల్లోనే పాలమూరు ప్రాజెక్టు పూర్తయ్యేదని అన్నారు. ప్రాజెక్టులు పూర్తి చేయకుండా నోటికొచ్చిన అబద్ధాలు మాట్లాడుతున్నారని లక్ష్మారెడ్డి మండిపడ్డారు. చంద్రబాబుకు చెప్పి రాయలసీమ ప్రాజెక్టును ఆపించానని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి అంటే.. ఆ వ్యాఖ్యలను ఏపీ ప్రభుత్వం తీవ్రంగా ఖండించిందని తెలిపారు.

## పాలమూరు మళ్లీ దివాలా తీసేలా కుట్రలు

### కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ శ్రీనివాస గౌడ్

మహబూబ్‌నగర్: ఉమ్మడి ఏపీలో అత్యంత దారుణంగా నష్టపోయిన జిల్లా పాలమూరు అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పాలమూరు జిల్లాను మంత్రులు ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. ఆస్తులు కూడబెట్టుకున్నారు తప్ప రైతులను ఆదుకోలేదని విమర్శించారు. పాలమూరులో పడావు పడ్డ ప్రాజెక్టులపై గులాబీ పార్టీ సమరభేరీ మోగించింది. ఈ క్రమంలో జూరాల ప్రాజెక్టును మాజీ మంత్రులు నింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో కూడిన బీఆర్‌ఎస్ ప్రతినిధుల బృందం సందర్శించింది. నార్లపూర్ పంప్‌హౌజ్, రిజర్వాయర్, వ్టటెం పంప్‌హౌజ్, కరివెన రిజర్వాయర్లను సందర్శించారు. ప్రాజెక్టులను పడావు పెట్టిన ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీలో రెండు ట్రిబ్యునల్‌లు ఏర్పాటైనా పాలమూరును పట్టించుకోలేదని అన్నారు. జూరాల ప్రాజెక్టు మొత్తం ఎండిపోతుందని శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. యాసంగి పంటలకు జూరాల ఆయకట్టుకు క్రాప్ హాలీడే ఇచ్చారని తెలిపారు. ఈ జూరాల నుంచి 70 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తారా అని ప్రశ్నించారు. ఇదేం ప్రభుత్వం? అసలు నీళ్ల మీద సోయి ఉందా అని నిలదీశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేసుకున్నామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తట్టెడు మన్ను తీయకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తారా అని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. పాలమూరు మళ్లీ దివాలా తీసేలా కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. పాలమూరును సస్యశ్యామలం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. రాజకీయ కోణంలో చూడకుండా పాలమూరు బాగు చేయాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ 45 టీఎంసీలకు ఒప్పుకోమని తెలిపారు. మా పాలమూరు జిల్లాకు కేటాయించిన నీళ్లు మాకు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు మీరిచ్చిన నీళ్ల కంటే డబుల్ నీళ్లను కేటాయించుకుంటామని తెలిపారు.

## భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఘనత కూటమిదే

### ప్రచారం చేసుకోవడం వైకాపాకు అలవాటే

### మండిపడ్డ ఎపి బిజెపి చీఫ్ పిఎన్‌వి మాధవ్

**విశాఖపట్నం:** భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఘనత కూటమి ప్రభుత్వ విజయమని, ఈ ఘనత తమదేనంటూ ప్రచారం చేస్తున్న వైసీపీపై ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ మండిపడ్డారు. ఏ పనీచేయని వైకాపాకు ఇలాంటి ప్రచారాలు చేసుకోవడం అలవాటేనన్నారు. మంగళవారం విశాఖపట్నంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఘనత నూటికి నూరు శాతం కూటమిదేనని ఆయన స్పష్టం చేశారు. అందులో ఏ మాత్రం సందేహం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అరాచకం సృష్టించి.. సంపద లేకుండా చేశారని మండిపడ్డారు. ఇప్పుడన్నీ తామే చేశామని వైసీపీ నేతలు చెబుతారని ఆయన వ్యంగ్యంగా అన్నారు. భోగాపురం ఏయిర్‌పోర్టు వల్ల మంచి జరుగుతుందని.. దీనిని స్వాగతించాలని వైసీపీ నేతలను తాను కోరుతున్నామని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల నీటి ప్రాజెక్టులు, కృష్ణా, గోదావరి నదీ జలాల వాటా సమస్యలు పరిష్కరించుకోవడానికి ట్రిబ్యునల్స్ ఉన్నాయని గుర్తు చేశారు. బచావత్ ట్రైబునల్ కూడా సమావేశమైందన్నారు. ఏదైనా రాష్ట్రాల్లో నీటి సమస్యలు, అభ్యంతరాలు ఉంటే.. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు చెబుతారని వివరించారు. ఆ సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఏపీ ప్రభుత్వం వ్యూహాత్మకంగా కొన్ని కొత్త ప్రాజెక్టులను ప్రకటించిందన్నారు. అలాగే పాత ప్రాజెక్టులను పూర్తి చేసుకొని ముందుకు వెళ్తోందన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు కెనాల్ పూర్తి చేసి.. కుప్పం వరకు నీళ్ల అందిస్తామని ఈ సందర్భంగా బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ ప్రకటించారు. త్వరలోనే పురుషోత్తపట్నం పూర్తి స్థాయి పనులు ప్రారంభమవుతాయని.. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు వేగవంతం అవుతున్నాయని తెలిపారు. ప్రాజెక్టులన్నీ పూర్తయితే.. ఏపీ సమగ్రాభివృద్ధి శరవేగంగా జరుగుతుందని రాష్ట్ర బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ విశ్వాసం వ్యక్తం చేశారు.


# పరకామణి కేసులో హైకోర్టు కీలక వ్యాఖ్యలు

### ప్రమేయం ఉన్న పోలీసులపై క్రిమినల్ కేసులు నమోదుకు ఆదేశం

**అమరావతి:** తిరుమలలో సంచలనం సృష్టించిన పరకామణి కేసులో ఏపీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో ప్రమే యం ఉన్న పోలీసు అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హైకోర్టు ధర్మా సనం ఆదేశాలు జారీ చేసింది. పరకామణి కేసుపై మంగళవారం హైకోర్టులో విచారణకు రాగా.. కేసు దర్యాప్తులో ముందుకు సాగాలని సీఐడీ, ఏసీబీని న్యాయస్థానం ఆదేశించింది. కౌంటింగ్ అంశంలో టేబుల్ ఏర్పాట్లపై సూచనలివ్వాలని హైకోర్టు స్పష్టం చేసింది. నిందితులతో కొందరు పోలీసులు చేతులు కలిపినట్లు సీఐడీ నివేదికలో స్పష్టంగా ఉందని.. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చోరీ కేసు మినహా సీఐడీ, ఏసీబీ దర్యాప్తులో తేలిన ఇతర అంశాలపై దర్యాప్తు కొనసాగించుకోవచ్చని తేల్చిచెప్పింది. తదుపరి విచారణను హైకోర్టు జనవరి 8 వాయిదా వేసింది. కాగా.. ఈ కేసులో అప్పటి సీఐ జగన్ మోహన్ రెడ్డి, టూటౌన్ సీఐ చంద్రశేఖర్‌తో పాటు నిందితుడు రవికుమార్ ఆస్తులను పరిశీలించిన ఎస్ఐ లక్ష్మీ రెడ్డికి కూడా ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఈ ముగ్గురు పోలీసు అధికారులను పోలీస్ శాఖ వీఆర్‌కు పంపించింది. అయితే ఈ కేసుతో ప్రమేయం ఉన్న పోలీసులపై చర్యలు తీసుకోవాలన్న హైకోర్టు ఆదేశాలతో ఈ ముగ్గురిపై ఏపీ సీఐడీ కేసు నమోదు చేసే అవకాశం ఉంది. అలాగే ఈ కేసుకు సంబంధించి కొన్ని పత్రాలను తారుమారు చేశారనే అభియోగాలు ఎదుర్కొంటున్న వన్ టౌన్ సీఐ విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేస్తారా లేదా అన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

# 'టాక్సిక్'లో మరో హీరోయిన్.. ఫస్ట్‌లుక్ రిలీజ్

యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్‌దాస్ 'టాక్సిక్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ట్యాగ్ లైన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో రుక్మిణి వసంత్ ఉన్నట్లు టీమ్ ప్రకటించింది. ఇందులో ఆమె మెలిసా అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. మోడ్రన్ డ్రెస్‌లో పబ్‌లో నడుస్తూ రుక్మిణి కనిపిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్‌ల లుక్‌ను విడుదల చేశారు. ఇప్పుడు రుక్మిణి కూడా అందులో ఉన్నట్లు అధికారికమైంది. దీంతో ఇందులో నలుగురు హీరోయిన్స్ అయ్యారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజబెత్‌గా, నయనతార గంగ పాత్రలో అలరించనున్నారు. చిన్నారుల కోసం ఎన్నో కథలు తెరకెక్కాయని, ఇది పెద్దలకు సందేశమిచ్చే చిత్రమని యశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. భారీ అంచనాల మధ్య వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది.




# రామ్‌చరణ్ బిర్యానీ పార్టీ.. ఎవరు వండారో తెలుసా?



స్టార్ హీరో రామ్‌చరణ్ ప్రస్తుతం బిర్యానీ పార్టీని ఎంజాయ్ చేస్తున్నారు. కుటుంబంతో కలిసి కుండ బిర్యానీ రుచిని ఆస్వాదిస్తున్నారు. 'ప్రతి ఇంట్లోనూ బిర్యానీ చేసుకుంటారు. అదేమైనా గొప్పా' అనుకుంటున్నారా? అవును! ఆ బిర్యానీ వండింది ప్రముఖ జపనీస్ చెఫ్ ఒసావా టకమసా. 15 ఏళ్లుగా బిర్యానీ వండటంలో చేయి తిరిగిన నల భీముడు. వివిధ రకాల బిర్యానీలు చేయడంలో మనోడే దిట్ట. ముఖ్యంగా సింగిల్ పాట్ బిర్యానీ వండాడంటే మెతుకు మిగలకుండా అది ఖాళీ కావాల్సిందే.

గత కొద్ది రోజులు 'పెద్ది' షూటింగ్‌లో బిజీగా ఉన్న స్టార్ హీరో రామ్‌చరణ్ ప్రస్తుతం కాస్త విరామం ఇచ్చారు. ఈ క్రమంలో చరణ్ నివాసానికి వచ్చిన ఒసావా తనదైన శైలిలో బిర్యానీ వండి రుచి చూపించారు. తక్కువ గ్రేవీతో బిర్యానీ వండిన విధానం, సువాసన అద్భుతంగా ఉందని చరణ్ కితాబిచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. చరణ్‌తో పాటు, ఆయన తల్లి సురేఖ, చరణ్ సతీమణి ఉపాసన, ఇతర కుటుంబ సభ్యులు కూడా ఒసావా చేసిన బిర్యానీ రుచి చూసి వాహ్ వా! అన్నారు. ఇక చరణ్ సినిమాల విషయానికొస్తే బుచ్చిబాబు దర్శకత్వంలో 'పెద్ది'లో నటిస్తున్నారు. జాన్వీకపూర్ కథానాయిక. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. 'చికిరి' సాంగ్ ఓ ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. మార్చి 27న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# అందరూ మెచ్చేలా ది రాజాసాబ్



''ప్రభాస్ 'బాహుబలి'కి ముందు ఎలా కనిపించేవారో 'ది రాజాసాబ్' చిత్రంలో అలా కనిపిస్తార''న్నారు నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్. ఈ సినిమాలోని కామెడీ, రొమాన్స్, యాక్షన్, ఫాంటసీ అంశాలు అందర్నీ అలరిస్తాయని తెలిపారు. ప్రభాస్ టైటిల్ పాత్రలో నటించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని మారుతి తెరకెక్కించారు. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. ఈ సినిమా ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలోని ''నాచే నాచే..'' గీతాన్ని సోమవారం ముంబయిలో విడుదల చేశారు.

ఈ సందర్భంగా నిధి అగర్వాల్ మాట్లాడుతూ.. ''ఈ చిత్రం రొమాంటిక్ హారర్ ఫాంటసీ జానర్‌లో రూపొందింది. ఇది భారతీయ సినిమాకి కొత్త జానర్'' అన్నారు. సీనియర్ నటి జరీనా వహాబ్ మాట్లాడుతూ.. ''హిందీలో కుటుంబ కథలు పూర్తిగా కనుమరుగైపోయాయి. కానీ దక్షిణాదిలో అలాంటి కథలు బాగా వస్తున్నాయి. ఈ సినిమా ప్రభాస్‌ది అని చెప్పగానే నటించడానికి ఓకే చెప్పేశాను''అని చెప్పారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. ''మా చిత్రం కోసం భారతీయ చిత్రసీమలో ఎప్పుడూ చేయనంత పెద్ద ఇండోర్ సెట్ వేశాం. వీఎఫ్‌ఎక్స్ కూడా చాలా గొప్పగా ఉంటాయి'' అన్నారు. ''పిల్లలకీ.. పెద్దలకీ నచ్చే చిత్రమిది. దీంట్లో ప్రభాస్‌తో కలిసి నటించడం మర్చిపోలేన'న్నారు నటి మాళవిక. ఈ కార్యక్రమంలో బోమన్ ఇరానీ, రిద్ధి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ చర్చకొచ్చిన 9 ఏళ్ల నాటి సినిమా



కొన్ని సినిమాలు ఒక పట్టాన థియేటర్లలోకి రావు. పెద్ద పెద్ద హీరోలు నటించిన సినిమాలు కూడా అందులో ఉన్నాయి. హీరో విక్రమ్ నటించిన ధృవనక్షత్రం (తమిళ్ లో ధృవ నట్చత్తిరం) సినిమా కూడా అలానే కాలగర్భంలో కలిసిపోయిందని చాలామంది అనుకున్నారు.

కానీ దర్శక-నిర్మాత గౌతమ్ మీనన్ మాత్రం పట్టు వదల్లేదు. ఎలాగైనా ఆ సినిమాను రిలీజ్ చేయాలనే దృఢ సంకల్పంతో ఉన్నాడు. ఏళ్లుగా ప్రయత్నిస్తూ, ఎప్పటికప్పుడు విఫలమౌతూనే ఉన్నాడు. అయితే ఈ ఏడాది మాత్రం కచ్చితంగా సినిమా వస్తుందని చెబుతున్నాడు. ఈ సినిమా చుట్టూ ఉన్న ఆర్థిక సమస్యలన్నింటినీ క్లియర్ చేశాడట గౌతమ్ మీనన్. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఫైనాన్షియల్ సెటిల్‌మెంట్స్ అన్నీ దాదాపు సెటిల్ అయిపోయాయని, త్వరలోనే సినిమా రిలీజ్ అవుతుందని ప్రకటించాడు.

విక్రమ్ హీరోగా నటించిన ఈ సినిమా షూటింగ్ ను 2017లో ప్రారంభించారు. అప్పట్నుంచి ఎన్నో అడ్డంకులు. చివరికి నిర్మాణ సంస్థలు కూడా మారిపోయాయి. ఒక దశలో లీగల్ ఇష్యూలు కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది ఈ సినిమా.

విక్రమ్ సరసన రీతూ వర్మ హీరోయిన్ గా నటించిన ఈ సినిమా స్పై థ్రిల్లర్ కాన్సెప్ట్ తో తెరకెక్కింది. దాదాపు 9 ఏళ్ల కిందటి ఈ సినిమా, ఇప్పటితరాన్ని ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి. వచ్చే నెలలో సినిమా రిలీజ్ అంటున్నారు.

# 'వారణాసి' గ్లింప్స్.. అక్కడ ఫస్ట్ ఇండియన్ సినిమాగా రికార్డు




రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న చిత్రం 'వారణాసి' . ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు

జనవరి 5న ఈ సినిమా టైటిల్ టీజర్‌ను పారిస్‌లోని లే గ్రాండ్ రెక్స్ థియేటర్‌లో ప్రదర్శించారు. ఇంటర్నేషనల్ ఆడియన్స్ నుంచి ఆ వీడియోకు మంచి స్పందన వచ్చింది. ఈ విషయం తెలుపుతూ లే గ్రాండ్ రెక్స్ తన అధికారిక సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. దీంతో అక్కడ ప్రదర్శించిన తొలి భారతీయ సినిమా గ్లింప్స్‌గా 'వారణాసి' రికార్డు నెలకొల్పింది. ఇది ఇండియన్ సినిమాకు గొప్ప గుర్తింపు అని అభిమానులు భావిస్తున్నారు. గతంలో రజనీకాంత్ 'కబాలి', ప్రభాస్ 'బాహుబలి 2', 'సాహో' చిత్రాలను ఈ థియేటర్‌లో ప్రదర్శించారు. అయితే విడుదలకు ముందే భారీ స్థాయిలో గ్లింప్స్ లాంచ్ ఈవెంట్ జరగడం ఇదే తొలిసారి కావడం విశేషం.

యాక్షన్ అడ్వెంచర్ మూవీగా 'వారణాసి' సిద్ధమవుతోంది. ఇందులో మహేశ్‌బాబు 'రుద్ర' పాత్రలో నటిస్తోన్న విషయం తెలిసిందే. ఈ పవర్‌ఫుల్ పాత్ర కోసం ఆయన ప్రాచీన భారత యుద్ధ కళ కలరిపయట్టు నేర్చుకున్నారు. ఇందులో కొన్ని సన్నివేశాల్లో ఆయన రాముడిగానూ కనిపించనున్నారు. మందాకిని పాత్రలో ప్రియాంక చోప్రా, కుంభ పాత్రలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు.

**విడుదల తేదీ వైరల్..**

ఐమ్యాక్స్ వెర్షన్‌లోనూ రూపొందుతున్న ఈ సినిమా 2027 వేసవిలో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని 120 దేశాల్లో రిలీజ్ చేయాలని రాజమౌళి ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రం 2027 ఏప్రిల్ 9న విడుదల కానున్నట్లు రెండు రోజులుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక సమాచారం కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# జోరుగా మెగా 158 సన్నాహాలు



ఈ సంక్రాంతికి 'మన శంకర వ ర ప్రసాద్‌గారు' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు కథానాయకుడు చిరంజీవి. అయితే ఈ చిత్ర హడావుడి పూర్తయిన వెంటనే చిరు తదుపరి సినిమాని పట్టాలెక్కించేందుకు తెర వెనుక సన్నాహాలు మొదలైపోయాయి. 'మెగా 158' వర్కింగ్ టైటిల్‌తో సెట్స్‌పైకి వెళ్లనున్న ఆ చిత్రానికి బాబీ దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. 'వాల్తేరు వీరయ్య' విజయం తర్వాత ఈ ఇద్దరి కాంబో నుంచి రానున్న కొత్త సినిమా ఇది. కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా ఫిబ్రవరిలో పూజా కార్యక్రమాలతో మొదలు కానుందని సమాచారం. చిరంజీవి మార్చి నుంచి సెట్స్‌లోకి అడుగు పెట్టనున్నారని తెలిసింది. ఇది పూర్తిగా యాక్షన్ ప్రాధాన్యమున్న కథతో ముస్తాబు కానుందని.. చిరు మునుపెన్నడూ చేయని శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని తెలుస్తోంది. దీంట్లో ఆయనతో పాటు మరో స్టార్ కూడా తెర పంచుకునే అవకాశమున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది.

అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన 'మన శంకరవరప్రసాద్‌గారు' ప్రీ రిలీజ్ వేడుకని ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు చిత్రవర్గాలు సోమవారం ప్రకటించాయి.

Edited, Printed and Owned by **K. NARSIMHA RAO**, Printed at **PRIYANKA PRINTERS**, #1-1/18/1, Rtc X road, Musheerabad, Hyderabad - 20 Published From #Mig 62/2, Kphb, Kukatpally, Hyderabad - 72
Editor K. NARSIMHA RAO, RNI Regn. No. TELTEL 2022/85377 Email: gramadandora@gmail.com, WWW.gramadandora.com Cell: 9493531417